VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

సానుకూల ఆలోచనలు
ఉన్నవారికి
ఆనందం
నీడలా
వెంటే ఉంటుంది.
- గౌతమ బుద్ధుడు

అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250

Circulated at Visakhapatnam, Hyderabad, Vijayawada, Guntur, Tirupati, Rajahmundry, Kakinada, Kadapa, Nellore, Srikakulam, Vizianagaram, Yanam, Bhubaneswar, Raipur

RNI No.52722/90 సంపుటి:38 సంచిక :129 విశాఖపట్నం, 24 ఫిబ్రవరి 2026 మంగళవారం E-mail : vspnews@gmail.com పేజీలు : 8 వెల : రూ.2.00

## రాజమహేంద్రవరం ఘటన

# మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు

### సీఎం చంద్రబాబు



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 23 :** రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో స్థానికులు అస్వస్థతకు గురైన ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. లాలాచెరువు ప్రాంతంలో నలుగురు చనిపోయారని.. ఎనిమిది మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వరలక్ష్మి డెయిరీకి చెందిన కల్తీ పాల వల్లే పలువురు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. సెక్షన్ 194 కింద బాధ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

**భావితరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. సంక్షేమ బడ్జెట్ కేటాయింపులపై ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా కూడా వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. “ సంక్షేమం విషయంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశాం. ఆటోకార్మికులు, మత్స్యకారులు, చేనేతలకు కూడా మేలు చేశాం. నిత్యావసర సరకులు కూడా సక్రమంగా అందించేలా సాంకేతికత సాయం తీసుకున్నాం. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం కేటాయింపులు ఎక్కువ చేశాం. బడ్జెట్ కేటాయింపులు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా తలసరి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.54 లక్షలకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. భావితరాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. అంగన్‌వాడీ నుంచి స్కూళ్లు, కాలేజీల వరకు మంచి విద్య, వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నాం. పేద వర్గాల ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాం” అని అన్నారు.

పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నట్లు చంద్రబాబు వివరించారు. “ 10లక్షల బంగారు కుటుంబాలని లక్షమంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. నిరంతరం పర్యవేక్షిస్తేనే ఏ కార్యక్రమమైనా ఫలితాలనిస్తుంది. అట్టడుగున ఉన్న పేద వర్గాలను కూడా ఆదుకునేలా పీ4 ప్రణాళికలు రూపొందించాం. పూట గడవని పేదవారిని పైకి తీసుకురావడంపై అందరూ ఆలోచించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని ప్రధాని నిర్దేశించారు. ఈ లక్ష్యాలు సాధించాలంటే పేదరికం ఉండకూడదు. కొన్ని బీసీ వర్గాల నుంచి ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నాం. ఎస్సీ వర్గీకరణ తీసుకొచ్చి దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్డీయే ప్రభుత్వానిది. మైనార్టీ వర్గాలకు కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించింది” అని చంద్రబాబు తెలిపారు.



## తిరుమలలోనూ స్వర్ణదేవాలయం తరహా చట్టం

### ఏపీ ప్రభుత్వం యోచన

**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 23 :** తిరుమలలోనూ స్వర్ణ దేవాలయం తరహా చట్టాన్ని తీసుకొచ్చే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది. ఈ చట్టం ద్వారా తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశముంది.

అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును పలువురు మంత్రులు కలిశారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రి వారితో చర్చించినట్లు తెలిసింది. స్వర్ణ దేవాలయం చట్టాన్ని వెంటనే అధ్యయనం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మరోవైపు తితిదే నిబంధనలను మరింత కఠినతరం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్యమతస్థులు శ్రీవారి దర్శనం చేసుకోవాలంటే డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించింది.

## గతంలో 2,500 మందితో భద్రత

### ఇప్పుడు కేవలం 500 మందే: అనిత



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 23 :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా అసెంబ్లీ భద్రత విషయంలో టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నామని హోం మంత్రి అనిత అన్నారు. సోమవారం విలేకరులతో ఆమె ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. గతంలో అసెంబ్లీ సమావేశాలు జరిగితే భారీగా భద్రత కల్పించేవారని, వివిధ జిల్లాల నుంచి 2,500 మంది ఫోర్స్‌ను రప్పించేవారని తెలిపారు. కానీ, కూటమి ప్రభుత్వ హయాంలో టెక్నాలజీని ఉపయోగించి మ్యాన్‌పవర్‌ను తగ్గించే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలకు 500 మందిని మాత్రమే భద్రత కోసం వినియోగిస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యల కల్లోలం



### నాలుగుకు చేరిన మృతులు

**రాజమహేంద్రవరం, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 23 :** రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో మరో ఇద్దరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. చికిత్స పొందుతూ లాలాచెరువు చౌడేశ్వరినగర్‌కు చెందిన ఎన్.శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) సోమవారం ఉదయం చనిపోయారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో ఒక్కొక్కరుగా 14 మంది ఆసుపత్రిలో చేరారు. వీరిలో భాగిశెట్టి కనకరత్నం (76), తాడి కృష్ణవేణి (75) ఇప్పటికే మృతిచెందారు. బాధితుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడినవారే కాగా 5 నెలల శిశువు, మూడేళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనారోగ్యానికి గురవడంతో వారు ఆదివారం అధికారులకు ⏭ తరువాయి 2లో..

## రాజమహేంద్రవరం చౌడేశ్వరి నగర్ ప్రాంతంలో ఇంటింటా సర్వే: జిల్లా కలెక్టర్



**రాజమహేంద్రవరం, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 23 :** నగరంలోని లాలాపేట చెరువు చౌడేశ్వరి నగర్ ప్రాంతంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆసుపత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు మీడియా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తరఫున చేపట్టిన చర్యలను వివరించారు. కల్తీ పాలతో అస్వస్థతకు గురైనట్లు ఆరోపణలు వచ్చినందున పూర్తిస్థాయిలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. పాలు పోసిన వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. “వ్యాపారి 46 మంది రైతుల వద్ద పాలు సేకరించి 106 కుటుంబాలకు పోశాడు. ఆదివారం రాత్రి నుంచి ఇప్పటి వరకు 73 మంది నుంచి రక్తనమూనాలను సేకరించాం. వాటిని ఫొరెన్సిక్ ల్యాబ్‌కి ⏭ తరువాయి 2లో..

## లడ్డూ కల్తీపై వాస్తవాలను అసెంబ్లీలో పెడతాం : మంత్రి లోకేశ్



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 23 :** తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన వాస్తవాలను అసెంబ్లీలో మంగళవారం ప్రవేశపెడతామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగానే బయటపెడతామన్నారు. అసెంబ్లీకి రమ్మని ఎవరూ బొట్టుపెట్టి పిలవరని వైకాపా ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. సభకు రావటం సభ్యులుగా వారి బాధ్యత అని గుర్తుచేశారు. దేవుడిని కూడా వైకాపా నేతలు రోడ్డు మీదకు తీసుకురావవడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు ఆక్షేపణీయమన్నారు.

**మండలి ఛైర్మన్‌ను కలిసిన కూటమి ఎమ్మెల్సీలు**

శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజును కూటమి ఎమ్మెల్సీలు ఆయన ఛాంబర్‌లో కలిశారు. చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోలతో సభకు వచ్చిన ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని ⏭ తరువాయి 2లో..

## క్రికెట్ మ్యాచ్ చూస్తానంటే.. జగన్‌కూ టికెట్ తీసుకుంటా: లోకేశ్



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 23 :** వైకాపా హయాంలో సాక్షి, భారతి సిమెంట్స్ రూ.1000 కోట్లు లబ్ధి పొందాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు.“ హెరిటేజ్ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందలేదు. కిలో నెయ్యి రూ.360కి ఎక్కడ దొరికినా అది కల్తీయే. మార్కెట్‌లో రూ.1000పైన ఉంటే.. రూ.360కి ఇచ్చేది కల్తీ కాక మరేంటి? ఇందాపూర్ డెయిరీ.. హెరిటేజ్‌కు కో కంపెనీ అనడం విడ్డూరంగా ఉంది. కో కంపెనీ అనేది ఉండదనే విషయం బొత్సకు తెలియదా అని ప్రశ్నించారు.

## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

### ఏపీ పోలీసుల అదుపులో బిహార్ అధికారి



**అమరావతి, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 23 :** బిహార్ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్ నాయక్ నిందితుడిగా ఉన్నారు. ఆ సమయంలో ఆయన సీఐడీ డీఐజీగా పనిచేశారు. గుంటూరు నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. బిహార్‌లో ఆయనను ఏపీ పోలీసులు ట్రాన్సిట్ వారెంట్‌పై రాష్ట్రానికి తీసుకొస్తున్నారు.

## పాలు లేకుండా నెయ్యి తయారీనా

### ఇది మహానుభావుల గొప్పతనం

- గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు ఎద్దేవా
- కార్యక్రమంలో మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు



**విజయనగరం, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 23 :** పాలు లేకుండా నెయ్యి తయారు చేసే శాస్త్రవేత్తలు పుట్టుకొచ్చారని గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్టు ఛైర్మన్ అశోక్ గజపతిరాజు ఎద్దేవా చేశారు. విజయనగరం కోటలో మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ లక్ష్మీపతిరాజు అధ్యక్షతన ఆదివారం ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘తితిదేకు కల్తీ నెయ్యి సరఫరా వెలుగుచూశాక.. రసాయనాలతో నెయ్యి తయారవుతుందా అని ఇటీవల కొంతకాలంగా చర్చ జరుగుతోంది. చట్టాలు.. మంచివారి చేతిలో పెడితే మంచి, చెడ్డవారి చేతిలో పెడితే చెడు జరుగుతాయి. గత ప్రభుత్వ హయాంలో ⏭ తరువాయి 2లో..

# దేశీయంగా కేసీ-390 విమానాల తయారీ

- ఎంబ్రాయెర్ సీఈఓ ఫ్రాన్సిస్కో గోమెజ్
- ఆసియా దేశాలకు ఇక్కడి నుంచే ఎగుమతి చేస్తామని వెల్లడి



**దిల్లీ:** బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయెర్ మనదేశంలో కేసీ-390 మిలీనియం విమానాల తయారీకి సుముఖత చూపుతోంది. ఇందుకోసం ప్రధాన ఉత్పత్తి కేంద్రాన్ని భారత్‌లో నెలకొల్పేందుకు సిద్ధమని ఎంబ్రాయెర్ సీఈఓ ఫ్రాన్సిస్కో గోమెజ్ ఆదివారం ఇక్కడ తెలిపారు. ఇక్కడినుంచే ఆసియా పసిఫిక్ దేశాలకూ ఎగుమతి చేస్తామని పేర్కొన్నారు. రవాణాకు ఉపయోగపడే ఈ రకం 80 విమానాలకు భారత వైమానిక దళం నుంచి ఆర్డరు వస్తే, ప్లాంటు ఇక్కడే స్థాపిస్తామని పీటీఐ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. చిన్నపాటి రన్‌వేలపై నుంచి బయలుదేరేందుకు, శరవేగంగా బలగాలు-ఆయుధ సామగ్రిని తరలించేందుకు కేసీ-390 మిలీనియం విమానాలు పేరొందాయి. ఆకాశంలోనే ఇంధనం నింపుకొనే సదుపాయం కూడా వీటికి ఉంది. ఈ విమానాల కోసం భారత్‌లో ఎంఆర్ఓ (మరమ్మతు, నిర్వహణ, ఓవర్‌హాల్ సేవలు) కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకూ ఎంబ్రాయెర్ సిద్ధమవుతోంది. ఇప్పటికే నాటో కూటమిలోని స్వీడన్, నెదర్లాండ్స్, పోర్చుగల్ కూడా ఈ విమానాలను కొనుగోలు చేశాయని వివరించారు. ప్రస్తుతం వినియోగిస్తున్న ఏఎన్-32, ఐఎల్-76 విమానాల స్థానంలో కొత్తగా 80 మీడియం ట్రాన్స్‌పోర్ట్ విమానాలు సమకూర్చుకోవాలన్నది భారత వైమానిక దళం ప్రణాళిక. ఈ కాంట్రాక్టు కోసం కేసీ-390 మిలీనియంతో పాటు, ఎయిర్‌బస్ డిఫెన్స్- స్పేసెస్ ఎ-400ఎం, లాక్‌హీడ్ మార్టిన్‌కు చెందిన సీ-130జె సూపర్ హెర్క్యులస్ విమానాలూ పోటీపడుతున్నాయి.

# ఒక్క చిన్న మెసేజ్‌తో అకౌంట్ ఖాళీ!

**ఆదాయపు పన్ను రిఫండ్ కోసం ఎదురుచూస్తున్నారా?**

**ఆ ఆలస్యమే ఇప్పుడు సైబర్ నేరగాళ్లకు వరంగా మారింది**




ఆదాయపు పన్ను రిఫండ్ కోసం ఎదురుచూస్తున్నారా? ఆ ఆలస్యమే ఇప్పుడు సైబర్ నేరగాళ్లకు వరంగా మారింది. మీ ఆత్రుతను ఆసరాగా చేసుకుని 'రిఫండ్ పెండింగ్‌లో ఉంది' అంటూ పంపే ఒక చిన్న మెసేజ్, మీ బ్యాంక్ ఖాతాను క్షణాల్లో ఖాళీ చేస్తోంది. తాజాగా ఓ పన్ను చెల్లింపుదారుడు ఇలాంటి నకిలీ లింక్‌ను నమ్మి ఏకంగా రూ.1.5 లక్షలు పోగొట్టుకున్న ఘటన సంచలనం సృష్టిస్తోంది. అసలు ఈ స్కామ్ ఎలా జరుగుతోంది ఐటీ శాఖ పేరిట వచ్చే మెసేజ్‌లలో ఏవి నిజం ఏవి అబద్ధం అన్న విషయంలో జాగ్రత్త పాటించాలి.

ఏమిటీ స్కామ్ ఎలా జరుగుతోంది ప్రస్తుతం చాలా మందికి ఐటీ రిఫండ్ రావడంలో ఆలస్యం జరుగుతోంది. దీనిని గమనించిన మోసగాళ్లు, ప్రజల ఫోన్లకు ఎస్ఎంఎస్ పంపిస్తున్నారు. ఆ మెసేజ్ ఇలా ఉంటుంది. మీ ఇన్కమ్ ట్యాక్స్ రిఫండ్ ఆగిపోయింది. వెంటనే ఈ క్రింది లింక్ క్లిక్ చేసి మీ వివరాలను వెరిఫై చేసుకోండి. లేదంటే మీ రిఫండ్ రద్దవుతుంది అని పంపుతున్నారు. మోసం జరిగే తీరు ఇదే మెసేజ్‌లో ఉన్న లింక్ క్లిక్ చేయగానే అది అచ్చం ఆదాయపు పన్ను శాఖ అధికారిక వెబ్‌సైట్‌లా ఉండే నకిలీ సైట్‌కి తీసుకెళ్తుంది. అక్కడ మీ పాన్ నంబర్, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఎంటర్ చేయమని అడుగుతారు. చివరగా మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీని ఎంటర్ చేయగానే మీ బ్యాంక్ ఖాతా యాక్సెస్‌ను మోసగాళ్లు పొందుతారు. క్షణాల్లో మీ అకౌంట్ నుంచి డబ్బు డ్రా చేస్తారు. నేరగాళ్లు మిమ్మల్ని ఎలా భయపెడతారంటే? "వెంటనే చేయండి", "చివరి అవకాశం" అంటూ మిమ్మల్ని ఆలోచించకుండా చేస్తారు. రిఫండ్ క్యాన్సిల్ అవుతుంది అని హెచ్చరిస్తారు. ప్రభుత్వ లోగోలు, రంగులు ఉపయోగించి అది అసలైన వెబ్‌సైట్ అనే భ్రమ కలిగిస్తారు. ఆదాయపు పన్ను శాఖ కీలక సూచనలు ఈ తరహా మోసాలపై ఆదాయపు పన్ను శాఖ ప్రజలను అప్రమత్తం చేస్తూ ఈ క్రింది విషయాలను స్పష్టం చేసింది. ఐటీ శాఖ ఎప్పుడూ కూడా ఎస్ఎంఎస్ ద్వారా రిఫండ్ వెరిఫికేషన్ లింకులు పంపదు. పాస్‌వర్డ్‌లు, పిన్ నంబర్లు లేదా బ్యాంక్ వివరాలను ఫోన్ ద్వారా గానీ, మెసేజ్ ద్వారా గానీ ఎప్పుడూ అడగదు. ఫండ్ స్టేటస్ తెలుసుకోవాలంటే నేరుగా incometax.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి లాగిన్ అవ్వాలి.

మీరు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే తెలియని లింకులను క్లిక్ చేయకండి. ఫూ షేర్ చేయవద్దు.. ఎవరితోనూ మీ ఓటీపీ పంచుకోవద్దు. ఏదైనా లింక్ క్లిక్ చేసినప్పుడు పైన ఉన్న అడ్రస్ బార్‌లో స్పెల్లింగ్‌లు సరిగ్గా ఉన్నాయో లేదో చూడండి. ఒకవేళ మీరు మోసపోయినట్లయితే వెంటనే 1930 కు కాల్ చేయండి లేదా cybercrime.gov.in లో రిపోర్ట్ చేయండి. రిఫండ్ రావడం ఆలస్యమైతే మీ అడ్వైజర్‌ను సంప్రదించండి లేదా అధికారిక పోర్టల్‌లో గ్రీవెన్స్ రైజ్ చేయండి. అపరిచితులను నమ్మి కష్టార్జితాన్ని పోగొట్టుకోకండి.

# అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే టార్గెట్ చేస్తున్నారు: విజయ్

**తమిళనాడు :** ప్రభుత్వాల అవినీతిని, అక్రమాలను ప్రశ్నిస్తూ.. వాటికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నందుకే అందరూ తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని టీవీకే చీఫ్ విజయ్ ఆరోపించారు. తమ పార్టీ నిర్వహించే బహిరంగ సభలకు కూడా డీఎంకే ప్రభుత్వం అనుమతి ఇవ్వట్లేదన్నారు. అందువల్లే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలను కలవలేకపోతున్నానని వెల్లడించారు. టీవీకే ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన అనంతరం ప్రతి గ్రామాన్ని సందర్శిస్తానని హామీ ఇచ్చారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా.. వెనక్కి తగ్గనని అవినీతిని ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు. వేలూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో విజయ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు.



రాష్ట్రంలో అవినీతి, నేరాలను అరికట్టడంలో స్టాలిన్ ప్రభుత్వం విఫలమయ్యిందని విజయ్ ఆరోపించారు. త్వరలో జరగనున్నవి ఎన్నికలు కాదని తమిళనాడు ప్రజలకు, అవినీతి ప్రభుత్వానికి మధ్య యుద్ధమని అన్నారు. ఈ యుద్ధంలో ప్రజలే విజయం సాధిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో తనను ఎలాగైనా ఓడించాలనే ఆలోచనతో స్టాలిన్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు ఓటు వేస్తే భాజపాకు వేసినట్లేనని అన్నారు. ఎన్నికల్లో ఓటమి భయంతో స్టాలిన్ ప్రభుత్వం భాజపాతో పొత్తు పెట్టుకోవాలని చూస్తుందని ఆరోపించారు. పరిస్థితులకు అనుగుణంగా మారిపోవడం ఆ పార్టీ నేతలకు అలవాటేనని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడానికి కఠిన చర్యలు తీసుకుంటానని విజయ్ అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవ్వడానికి విద్యార్థులు లక్షల రూపాయలు వెచ్చించే అవసరం లేకుండా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే శిక్షణనిస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు పరిశుభ్రమైన, సురక్షితమైన బాత్రూంలను ఏర్పాటు చేస్తామన్నారు. దేశంలోనే సురక్షితమైన రాష్ట్రంగా తమిళనాడును మారుస్తానని ప్రతిజ్ఞ చేశారు.

# తక్షణమే ఇరాన్‌ను వీడండి

## భారత్ పౌరులకు కేంద్రం అడ్వైజరీ




**ఇరాన్ :** ఇరాన్‌లో మరోసారి ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఏ క్షణమైనా అమెరికా దాడి చేయొచ్చన్న అంచనాలు, విద్యార్థుల ఆందోళనలతో పరిస్థితులు మళ్లీ గందరగోళంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారత పౌరులకు మన దేశ ఎంబసీ తాజాగా అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది.

"ఇరాన్‌లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా.. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు కొనసాగింపుగా మళ్లీ అడ్వైజరీ జారీ చేస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారతీయులు (విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు) కమర్షియల్ విమానాలతో సహా అందుబాటులో ఉన్న ప్రయాణ మార్గాల ద్వారా ఇరాన్‌ను తక్షణమే విడిచిపెట్టి వెళ్లండి. భారతీయ పౌరులు, భారత సంతతి వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించండి. ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఇరాన్‌లోని భారత ఎంబసీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ఉండాలని, అలాగే తాజా పరిణామాల కోసం స్థానిక మీడియాను గమనిస్తూ ఉండాలని సూచిస్తున్నాం. భారతీయులంతా పాస్‌పోర్ట్‌లు, ఐడీ కార్డులతో సహా తమ ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను ఎల్లప్పుడూ తమ వద్ద సిద్ధంగా ఉంచుకోవాలి. ఈ విషయంలో ఎలాంటి సహాయం కోసమైనా భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించండి. ఇప్పటివరకు ఎంబసీ వద్ద మీ పేర్లు నమోదు చేసుకోకపోతే వెంటనే రిజిస్టర్ చేయించుకోండి" అని భారత ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది.

ఇరాన్-అమెరికా మధ్య అణు చర్చలు ఇంతవరకూ కొలిక్కిరాలేదు. ఈ చర్చలు విఫలమైతే ఇరాన్‌పై దాడికి వెనుకాడబోమని అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇప్పటికే అమెరికా పలు విమాన వాహననౌకలు, జలాంతర్గాములు, ఫైటర్ జెట్‌లను పశ్చిమాసియాలో మోహరించింది. ఈ నేపథ్యంలోనే టెహ్రాన్‌లో మరోసారి ఆందోళనలు చెలరేగాయి. పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఈ పరిణామాలతో ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ తొలి దశ అల్లర్లలో 7,105 మంది ప్రాణాలు కోల్పోయారని అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘం తెలిపింది.

# ముందు ప్రజల హృదయాలను గెలవండి

## ప్రధాని పదవిని చేరాలంటే అది అవసరం

**మహిళా ఎంపీలను నా సీటు ఆక్రమణకు పంపిస్తారా?**

**విపక్షాలది అంత డొల్లతనమా : మోదీ**

**అత్యంత వేగవంతమైన మెట్రోను యూపీలో ప్రారంభించిన పీఎం**

**మేరఠ్ మెట్రో రైలులో ప్రయాణికులతో సంభాషించిన ప్రధాని మోదీ**



**మేరఠ్:** ప్రధానమంత్రి సీట్లో కూర్చోవాలని తపనపడుతున్నవారు ముందుగా ప్రజల హృదయాలను గెలవాలని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. పార్లమెంటులో ప్రధాని సీటును ఆక్రమించుకోవాలని మహిళా ఎంపీలను ఉసిగొల్పడం ద్వారా ఎవరూ ఆ స్థానాన్ని చేరుకోలేరని స్పష్టంచేశారు. మాతృమూర్తుల్ని, సోదరీమణుల్ని ఇలా పార్లమెంటులో ముందుకు నెట్టేంత డొల్లగా మారిపోయారా అని పరోక్షంగా లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దేశంలోనే అత్యంత వేగంగా గంటకు 120 కి.మీ. వేగంతో వెళ్లే మెట్రోరైలును ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో ఆదివారం మోదీ ప్రారంభించారు. నమో భారత్ రైలును సైతం జెండా ఊపి ప్రారంభించారు. రూ.12,930 కోట్ల ప్రాజెక్టులనూ జాతికి అంకితం చేశారు. యూపీ సీఎం ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించి, విద్యార్థులు, అధికారులతో ముచ్చటించారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు.

**కాంగ్రెస్ నగ్నత్వం దేశానికి తెలుసు**

దిల్లీలో నిర్వహించిన ఏఐ సమిట్‌లో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్నంగా నిరసన చేపట్టడాన్ని మోదీ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ తన మురికి రాజకీయాలకు వేదికగా దీనిని మార్చుకుందని విమర్శించారు. విదేశీ అతిథులు కూర్చున్న వేదిక వద్దకు కాంగ్రెస్ నాయకులు వచ్చి గందరగోళం సృష్టించారని తెలిపారు. కాంగ్రెస్ నేతలు సైద్ధాంతికంగా దివాలా తీసి, తమ దారిద్ర్యాన్ని చాటుకున్నారని చెప్పారు. "కాంగ్రెస్ నగ్నత్వం దేశానికి తెలుసు. ఇప్పటికే ప్రజల దృష్టిలో ఆ పార్టీ నేతలు దిగజారిపోయారు. ఇంకా ఇలాంటి పనులు చేయాల్సిన అవసరం ఏముంది? దేశాన్ని అప్రతిష్ఠపాలు చేసేపనిలో కాంగ్రెస్ తీరిక లేకుండా ఉంది. రాజకీయ విభేదాల కంటే వ్యక్తిగత శత్రుత్వంపైనే వారు దృష్టి పెడుతున్నారు. గతంలో నన్ను, నా తల్లిని అవమానించారు. ఇప్పుడు ప్రపంచ నేతల ఎదుట దేశాన్ని అవమానించారు. అన్ని పరిమితుల్ని వారు దాటిపోయారు. తమ చర్యలకు సిగ్గుపడాల్సింది పోయి అదొక గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. దేశాన్ని గొప్పదిగా చేసేందుకు ప్రజలు అహోరాత్రులు కష్టపడుతుంటే, విజయాలు సాధిస్తుంటే కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి" అని మండిపడ్డారు. ఇలాంటివాటిని తాను తప్పుపడితే 'విపక్షాలపై విరుచుకుపడ్డ మోదీ' అనే పతాక శీర్షికలు పెట్టొద్దని మీడియాకు విజ్ఞప్తి చేశారు. ఏఐ సదస్సు ఒక అంతర్జాతీయ కార్యక్రమమని, దానిలో భాజపా నేతలెవరూ లేరని చెప్పారు.

**తొలి ఆర్ఆర్‌టీఎస్**

దిల్లీ నుంచి మేరఠ్ మధ్య తిరగనున్న నమో భారత్ రైలు దేశంలోనే తొలి 'ప్రాంతీయ శీఘ్ర రవాణా వ్యవస్థ' (రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్- ఆర్ఆర్‌టీఎస్) కిందికి వస్తుంది. ఇది గంటకు 180 కి.మీ.ల వేగంతో ప్రయాణించేలా రూపొందించారు. 82 కిలోమీటర్ల కారిడార్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు. మేరఠ్ మెట్రో, నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్‌లు ఒకే మౌలిక సదుపాయాలను

# రూ. 3 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీఐ, ఎస్ఐ

**సింహాద్రిపురం, విశాఖ సమాచారమ్, ఫిబ్రవరి 23 :** వైఎస్సార్ జిల్లాలోని సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌పై ఏసీబీ జరిపిన దాడుల్లో సీఐ కేవీ రమణ, ఎస్ఐ అనిల్‌లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక



కేసు విషయంలో బాధితుడిని నుంచి రూ. 3 లక్షల లంచం డిమాండ్ చేయడంతో అతను ఏసీబీకి సమాచారం ఇచ్చాడు. దాంతో ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్‌తో సీఐ, ఎస్ఐలను పట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికాలు దాడులు చేశారు. పులివెందుల రూరల్ సీఐ, సింహాద్రిపురం ఎస్ఐలను ఈ దాడుల్లో ఏసీబీకి దొరికేశారు. పులివెందులలో అత్యంత వివాదాస్పద సీఐగా కేవీ రమణకు పేరుంది. తాజాగా పోలీస్ స్టేషన్‌లోనే లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం కేవీ రమణను మరింత ఇరకాటంలోకి నెట్టింది.

విజయనగరం: జిల్లాలోని చాకివలస ఇంచార్జ్ వీఆర్వో ఏసీబీకి చిక్కారు. రూ. లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు ఇంచార్జ్ వీఆర్ఓ చిట్టిబాబు.

# పాలు లేకుండా నెయ్యి తయారీనా

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా 14లక్షల మంది విద్యార్థులను బడికి దూరం చేశారు. విద్యారంగం అభివృద్ధికి ఏర్పాటైన మాన్సాస్ ట్రస్టునూ ఇబ్బందిపెట్టారు' అని తెలిపారు. ట్రస్టును ఇబ్బందిపెట్టిన వ్యక్తి కూడా ఈ విద్యా సంస్థలో చదువుకున్నారని మాజీమంత్రి బొత్స సత్యనారాయణను ఉద్దేశించి అన్నారు.

**పాలిటెక్నిక్ కళాశాలకు మాన్సాస్ భూమి**

విజయనగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు మాన్సాస్ ట్రస్టు భూమి ఇచ్చిందని ఛైర్మన్ అశోక్ గజపతిరాజు తెలిపారు. ఇదే సంస్థపై గత ప్రభుత్వంలో వైకాపా నాయకులు మాట్లాడుతూ 'అప్పులు మీవి.. ఆస్తులు మావి' అని హాస్యాస్పదంగా వ్యాఖ్యానించారు. గతంలో తనను శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపిస్తామన్నారని, వారికి భయపడకుండా ఎదుర్కొన్నానని గుర్తుచేశారు.

# రాజమహేంద్రవరం చౌడేశ్వరి నగర్ ప్రాంతంలో ఇంటింటా సర్వే: జిల్లా కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

పంపించాం. ఫలితాలు సాయంత్రానికి వస్తాయి. అస్వస్థతకు గురైన వారిలో ఇప్పటి వరకు నలుగురు మృతిచెందారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే.. కాల్ సెంటర్‌కి (94940 60060)ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు" అని కలెక్టర్ సూచించారు.

**మెటీరియల్ సీజ్ చేశాం: ఎస్పీ**

జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ ఈ ఘటనపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. పాల వ్యాపారి ఇంటి వద్ద మెటీరియల్‌ను సీజ్ చేశామన్నారు. ప్రజలు సంయమనం పాటించాలని కోరారు. ఇప్పటి వరకు 12 కేసులు నమోదయ్యాయని.. వారిలో నలుగురు మృతిచెందినట్లు జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

# రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యల కల్లోలం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం ఇచ్చారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రుల పాలైన బాధితులందరికీ ఒకే వ్యక్తి పాలు పోస్తుండటంతో అక్కడే కల్తీ జరిగి ఉండొచ్చని వైద్యాధికారులు, బాధితులు పోలీసులకు తెలిపారు. శివరాత్రి (15వ తేదీ) రోజు పాలు, పెరుగు చేదుగా అనిపించాయని కొంతమంది బాధితులు చెప్పారు. కోరుకొండ మండలానికి చెందిన గణేష్ అనే వ్యాపారి వీరందరికీ పాలు పోస్తున్నట్లు గుర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. బాధితుల నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను టాక్సికాలజీ పరీక్షకు పంపించారు. ఆ నమూనాల నివేదికలు రావాల్సి ఉంది.

# లడ్డూ కల్తీపై వాస్తవాలను అసెంబ్లీలో పెడతాం : మంత్రి లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. విలువైన సమయం వృథా చేయకుండా చూడాలని.. సభ సజావుగా నడిపించాలని కోరారు.

# తమిళనాడులో 5.67కోట్ల మంది ఓటర్లు

## సర్ తుది జాబితా విడుదల



**తమిళనాడు :** మరికొద్ది రోజుల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న తమిళనాడులో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయ్యింది. ఈ క్రమంలోనే సోమవారం తుది ఓటరు జాబితాను ఈసీ విడుదల చేసింది. రాష్ట్రంలో మొత్తం 5.67కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. గత ఎన్నికలతో పోలిస్తే 74లక్షల మంది ఓటర్లు తగ్గడం గమనార్హం.

గతేడాది అక్టోబరు చివరి నాటికి రాష్ట్రంలో 6.41కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అయితే 'సర్' ప్రక్రియ పూర్తయిన తర్వాత గతేడాది డిసెంబరు 19న ముసాయిదా ఓటర్ల జాబితాను ఈసీ విడుదల చేసింది. అందులో ఓటర్ల సంఖ్యను 5.43కోట్లుగా పేర్కొంది. అంటే.. దాదాపు 97లక్షల ఓటర్ల పేర్లను ఈసీ తొలగించింది. అనంతరం ఓటు హక్కు కోల్పోయిన వారు అభ్యంతరాలు తెలిపేందుకు కొంత గడువు కల్పించింది.

వారి దరఖాస్తులను పరిశీలించిన అనంతరం 27.53లక్షల మంది అర్హులైన ఓటర్లను చేర్చింది. 4.23లక్షల మంది అనర్హులను జాబితా నుంచి తొలగించింది. నేడు (ఫిబ్రవరి 23న) రాష్ట్రంలో ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. ప్రస్తుతం తమిళనాడులో 5.67కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. వీరిలో 2.77 కోట్ల మంది పురుషులు, 2.89కోట్ల మంది మహిళలు ఉన్నారు. అంటే గతంలో పోలిస్తే ఓటర్ల సంఖ్య 74లక్షల మేర తగ్గినట్లయ్యింది. అత్యధికంగా చెంగల్‌పట్టు జిల్లాలోని 27-శోలింగనల్లూర్ స్థానంలో 5.36లక్షల మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా చెన్నైలోని 18-హార్బర్ నియోజకవర్గంలో 1.16లక్షల ఓటర్లు ఉన్నారని ఈసీ వెల్లడించింది.

తమిళనాడు ప్రస్తుత అసెంబ్లీ గడువు ఈ ఏడాది మే నెలతో ముగియనుంది. అంతకంటే ముందు ఏప్రిల్‌లో శాసనసభ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి షెడ్యూల్‌ను మార్చి మధ్యలో ఈసీవిడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ ఎన్నికలతో నటుడు విజయ్ టీవీకే పార్టీతో ప్రత్యక్ష ఎన్నికల్లోకి అడుగుపెడుతున్నారు. డీఎంకే కూటమి, భాజపా-అన్నాడీఎంకే, టీవీకే పోరుతో ఈసారి ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి.

# రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్య పరీక్షలు





**విశాఖ సమాచారం :ప్రతినిధి( శివ కృష్ణ) :** రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు మొదలవడంతో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి వాతావరణం నెలకొంది తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వద్ద ఉన్న పరీక్షా కేంద్రానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఉదయాన్నే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు.పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను పోలీసులు మరియు కళాశాలల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష హాలుకు పంపించారు.ఎస్సై టి రామకృష్ణ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేశారు. పరీక్ష కేంద్రం వద్ద పరీక్షలు ముగిసేవరకు 100 మీటర్లు వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది అన్నారు.సోమవారం నిర్వహించిన తెలుగు, సంస్కృతం, జనరల్ ఫౌండేషన్ కోర్సు సంబంధించిన పరీక్షకు 352 మంది విద్యార్థుల హాజరు కావలసి ఉండగా 326 మంది హాజరైనట్లు 26 మంది గైర్హాజరు అయినట్లు కళాశాల చీఫ్ సూపర్డెంట్ సూర్యకళ మరియు డిపార్ట్మెంటల్ ఆఫీసర్ సునీల్ జయచంద్ర తెలిపారు మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు మొదలవుతాయని అన్నారు


## ఈస్ట్ కోస్ట్ రైల్వే

టెండరు ప్రకటన నం.WAT-TRS-OT-21-2025-26

**పని పేరు మరియు దాని ప్రదేశం:**
ఎలక్ట్రిక్ లోకో షెడ్/విశాఖపట్నం వద్ద 3 -ఫేజ్ లోకోమోటివ్‌లలో E-70 బ్రేక్ సిస్టమ్ యొక్క ఎలక్ట్రానిక్ కార్డుల రిహాబిలిటేషన్ / అప్‌గ్రేడ్.

**టెండరు విలువ:** రూ.2,08,30,607.46,
బయానా: రూ.2,54,200.00, పని పూర్తి చేయు కాలం: 3 (మూడు) సంవత్సరాలు.

**టెండరు ముగింపు తేది మరియు సమయం:**
16.03.2026న 1500 గంటలకు.

ఈ టెండరుపై మాన్యువల్ ఆఫర్లు స్వీకరించబడవు మరియు అట్టి మాన్యువల్ ఆఫర్లు పరిశీలన లేకుండా తిరస్కరించబడును.
పై ఇ-టెండరు యొక్క ఇ-టెండరు డాక్యుమెంట్లు కలుపుకుని పూర్తి సమాచారం వెబ్‌సైట్ http://www.ireps.gov.in లో లభిస్తుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (TRS) / విశాఖపట్నం
PR-1157/Q/25-26

## ఈస్ట్‌కోస్ట్ రైల్వే

ప్రకటన నం. WDS/29/PU Painting/2025-27

**పని పేరు**
"విశాఖపట్నం డీజిల్ లోకోషెడ్ వద్ద 2 సంవత్సరాల కాలానికి డీజిల్ HHP/ ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల యొక్క PU (పాలియురేతిన్)"

**సుమారు పని వ్యయం:**
రూ. 1,13,73,517.74, బయానా: రూ. 2,06,900.00, పని పూర్తి చేయు కాలం: 24 నెలలు (02 సంవత్సరాలు)

**టెండరు ముగింపు తేది & సమయం**
24.03.2026న 1500 గం.లకు.

పై ఇ-టెండరు యొక్క ఇ-టెండరు డాక్యుమెంట్లు కలుపుకుని పూర్తి సమాచారం వెబ్‌సైట్ http://www.ireps.gov.in లో లభిస్తుంది.

గమనిక: కాగోరు టెండరుదారులు ఈ టెండరు కొరకు జారీ చేయబడినట్టి ఏవేని సవరణలు/మార్పులు గమనించుటకు టెండరు ముగింపు తేదీనకు ముందు 10 (పది) రోజులు వెబ్‌సైట్‌ను తిరిగి దర్శించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్ (D), విశాఖపట్నం
PR-1156/Q/25-26


# పరీక్షల వేళ అశ్రద్ధ వద్దు

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** నర్సీపట్నం, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ఎంత ముఖ్యమో ఆరోగ్యాన్ని కాపాడుకోవడమూ అంతే ముఖ్యం. ఆరోగ్యంగా ఉండటమే విజయానికి తొలిమెట్టు. పరీక్షల సమయంలో ఆరోగ్యం క్షీణిస్తే ఏడాదిపాటు చదివిందంతా వృథా అవుతుంది. ఆహారపు అలవాట్లు మార్చుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. రోజూ పోషకాహారం తీసుకోవడం తప్పనిసరి. చదువులో పడి ఆకలిని విస్మరిస్తే మొదటికే మోసం వస్తుంది. చదివింది గుర్తుపెట్టుకుని పరీక్షల్లో రాయడం ఒక ఎత్తు. పరీక్షలకు శారీరక, మానసిక సన్నద్ధత మరో ఎత్తు. పోషకాహారం ఇందుకు ఉపకరిస్తుంది. వైద్యాధికారులు, పోషకాహార నిపుణలు విద్యార్థులకు పలు సూచనలు చేస్తున్నారు. ఉదయం అల్పాహారం 8.30 గంటల్లోగా తీసుకోవాలి. సులభంగా జీర్ణమయ్యే ఇడ్లీ, ఉడికించిన కోడి గుడ్లు, గ్లాసు పాలు తీసుకోవచ్చు. రాత్రుళ్లు నానబెట్టి తొక్క తీసిన మూడు, నాలుగు బాదం పప్పు గింజలు తినాలి. దీని వల్ల మెదడుకు గ్లూకోజ్ అంది చదివింది బాగా గుర్తుంటుంది. మధ్యాహ్నం ఒంటి గంటలోగా పప్పు, కాయగూరలతో భోజనం, కొద్దిగా పెరుగన్నం తీసుకోవాలి. మూడు గంటలకు అల్పాహారంగా కూరగాయల సలాడ్/ బిస్కెట్లు, సాయంత్రం ఉడికించిన శనగలు, వేరుసెనగ చిక్కీ తీసుకోవచ్చు. రాత్రి 8 గంటల్లోగా భోజనం ముగించాలి. కొద్దిగా అన్నం, కూరతో రెండు చపాతీలు తినొచ్చు. నిద్రకు ముందు గ్లాసు గోరువెచ్చని పాలు తాగాలి.

# ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణం



రులు రెచ్చిపోతున్నారు. తమ భూముల విలువను పెంచుకోవడానికి కొండను తవ్వి, వాగును పూడ్చేసి రోడ్డును నిర్మిస్తున్నారు. కిలోమీటరుకు పైగా 30అడుగుల వెడల్పుతో భారీ యంత్రాలతో ఆయా పనులు సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

**గత ప్రభుత్వ హయాంలో..:** గిరిజనులకు కొంత జిరాయితీ, డి-పట్టా భూములున్న ఇచ్ఛాపురం గ్రామంపై వైకాపాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే కన్ను పడింది. ఈ నేపథ్యంలో ఫ్రీహోల్డ్ చేసుకునేందుకు 2019లోనే తక్కువ ధరకు కొందరు గిరిజనుల నుంచి సుమారు 50 ఎకరాలు కొనుగోలు చేశారు. ఆయా భూముల్లోకి వెళ్లేలా రహదారి నిర్మించేందుకు 2020లోనే ప్రయత్నించారు. నాడు స్థానిక గిరిజన పెద్దలు అడ్డుకోవడంతో నిర్మాణం ఆగిపోయింది. అప్పట్లో అడ్డుకున్న వారిలో కొందరు పెద్దలు ఇటీవల మరణించడంతో ఆ నేత అమాయకులైన కొందరు గిరిజనులకు మాయమాటలు చెప్పి మళ్లీ రోడ్డు నిర్మాణం ప్రారంభించాడు.

**వెలుగులోకి ఇలా..:** గిరిజనుల భూముల్లో నుంచి దౌర్జన్యంగా రహదారి నిర్మించడంపై పోలీసులు, గనుల శాఖ అధికారులకు ఫిర్యాదులందడంతో అక్రమం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం బయటపడకుండా తామే రోడ్డు వేయించుకుంటున్నట్లు స్థానిక గిరిజనులతో చెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. విచారణకు వచ్చిన రెవెన్యూ అధికారులకు అలానే చెప్పించారు. మరో వైపు గనుల శాఖ అధికారులు అక్కడి యంత్రాలను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. వాస్తవానికి అనుమతి లేకుండా అటవీ భూములకు సమీపంలో కొండలను తొలిచి రహదారి నిర్మించడం నేరం. దీన్నుంచి తప్పించుకునేందుకు కొంతమంది స్థానికులతో కలిసి ఆ నేత నాటకం ఆడుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనుబాబును వివరణ కోరగా ప్రభుత్వ భూమిలోనైనా, సొంత స్థలాల్లోనైనా రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గిరిజన గ్రామంలో రహదారి నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు

# కేజీహెచ్‌లో వరుస ఘటనలతో పలువురి ఆందోళన



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గోనెసంచిలో మృతశిశువును పడేసి మూడు రోజులు దాటినా భద్రత సిబ్బంది గుర్తించకపోవడం దారుణమైన అంశం. 100కు పైగా సీసీ కెమెరాలు, 275 మంది భద్రత సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ... ఎక్కడికక్కడ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

**కొరవడిన సమన్వయం..!**

ఆసుపత్రి వైద్యాధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో పాటు, పరిపాలన అధికారులు, వైద్యాధికారుల మధ్య ఆధిపత్య పోరు ఎక్కువైంది. ఏడీఎంఈ స్థాయిలో ఉన్న వైద్యాధికారి ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఆసుపత్రి అడ్మిన్‌గా పని చేస్తున్నారు.
సివిల్ సర్జన్ ఆర్ఎంఒ, డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఒ, ముగ్గురు ఆర్ఎంఒలు ఆసుపత్రిలో వ్యవహారాలు పర్యవేక్షిస్తున్నారు. అయినా భద్రతాలోపం స్పష్టంగా కనిపిస్తుంది.

**ఇవీ ఘటనలు..!**

గతంలో కొందరు వ్యక్తులు ప్రసూతి విభాగం నుంచి ఓ శిశువును ఎత్తుకుపోయారు. పోలీసులు ఆ కేసును ఛేదించి శిశువును తల్లిదండ్రులకు అప్పగించారు.
కొద్దిరోజుల కిందట గిరిజన ప్రాంతానికి చెందిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్ వాహనం కోసం భర్త అయిదు గంటల సేపు నిరీక్షించాల్సి వచ్చింది. అలాగే పిల్లల విభాగం ఐసీయూ వెంటిలేటర్ల నుంచి మంటలు వచ్చాయి. కార్డియాలజీ విభాగం ఐసీయూలో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో పొగలు వ్యాపించాయి.
ఆసుపత్రి ఆవరణలోని ఆక్సిజన్ సరఫరా పైపులను దుండగులు కత్తిరించి, తీసుకెళ్లిపోయారు. వీటికి తోడు తరచూ ఆవరణలోని ద్విచక్ర వాహనాలు మాయమవడం, రోగుల బంధువులకు సంబంధించి విలువైన వస్తువులు చోరీకి గురవడం వంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

**ఏటా రూ.5.88 కోట్లు**

ఆసుపత్రిలో భద్రత కోసం 275 మంది సిబ్బంది ఒప్పంద ప్రాతిపదికన సేవలు అందిస్తున్నారు. వారి జీతభత్యాల కింద ప్రభుత్వం నెలకు రూ.49 లక్షల చొప్పున, ఏటా రూ.5.88 కోట్లు ఖర్చు చేస్తోంది. అయినా పూర్తిస్థాయిలో భద్రత కానరావడం లేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దృష్టి సారించి భద్రత, పర్యవేక్షణ లోపాలను సరిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

# ఘోషాసుపత్రి సేవలకు ఐఎస్‌వో ధ్రువీకరణ



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి(ఘోషాసుపత్రి) పేద, మధ్య తరగతి కుటుంబాల గర్భిణులకు వర ప్రదాయినిగా నిలుస్తోంది. ఇక్కడ వైద్యులు తొలుత సాధారణ ప్రసవానికి ప్రయత్నిస్తారు. వీలుకాని పక్షంలో సిజేరియన్ (సీ-సెక్షన్) చేస్తుంటారు. దీంతో ఎక్కువ మంది ఇక్కడకు వెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. రోగుల భద్రత, సేవల నాణ్యత, రికార్డుల నిర్వహణ తదితర అంశాల్లో ప్రమాణాలు మెరుగ్గా ఉండటంతో ఇటీవల హైదరాబాద్‌కు చెందిన 'హెచ్‌వైఎం' ఇంటర్నేషనల్ సంస్థ ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రం అందజేసింది.
పడకలు..వైద్య సేవలిలా: ఆసుపత్రిలో 250 పడకలు అందుబాటులో ఉన్నాయి. సొంతంగా నలుగురు వైద్యులు ఉన్నారు. ఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన నలుగురు ప్రొఫెసర్లు, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, 9 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు డిప్యుటేషన్‌పై సేవలందిస్తున్నారు. ఇక్కడకు విశాఖతోపాటు ఒడిశా నుంచి గర్భిణులు ప్రసవాలకు వస్తుంటారు. అనకాపల్లి ఆసుపత్రుల నుంచి హైరిస్క్ జాబితాలో ఉన్న గర్భిణులను తీసుకొస్తుంటారు. లాప్రోస్కోపిక్ సర్జరీలకు అవసరమైన అత్యాధునిక సామగ్రిని ప్రభుత్వం, దాతలు అందించారు. హైరిస్క్ గర్భిణులు ప్రసవం తర్వాత ఇంటికి వెళ్లిపోయినా.. సాధారణ స్థితికి వచ్చేవరకు సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులు, ఆశా కార్యకర్తల ద్వారా పర్యవేక్షిస్తుంటారు. ప్రస్తుతం రోజుకు దాదాపు 200 వరకు ఓపీ నమోదవుతోంది. 10 మేజర్, 12 మైనర్ శస్త్రచికిత్సలు, 25 వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. కొత్తగా మదర్, ఛైల్డ్ బ్లాక్ నిర్మించాలని, ఎనస్తీషియా, పిల్లల వైద్య నిపుణులు ఒక్కొక్కరే ఉండటంతో నియామకం చేపట్టాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు..: గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వారికి నాణ్యమైన సేవలందిస్తున్నాం. స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ ద్వారా నవజాత శిశువులకు చికిత్స అందిస్తున్నాం. ఇన్‌ఫెక్షన్లు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

# 'ఏఐ' ప్రభావంలోనూ అవకాశాలు




**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో కృత్రిమ మేధ కీలకంగా మారుతోంది. ఇది ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన విద్యార్థులు, నిరుద్యోగుల్లో వ్యక్తమవుతోంది. అయితే మారుతున్న సాంకేతికతకు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటే.. ఉద్యోగావకాశాలు పెరుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు. ఏఐ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో గీతం విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఆరు నైపుణ్యాలపై దృష్టి సారించాలని నిపుణులు సూచించారు.

**కొత్త అంశాలు నేర్చుకోవాలి:** మార్పులను అందిపుచ్చుకుని, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవారినే కంపెనీలు ఎంపిక చేసుకుంటున్నాయి. మీకు ఎంత అనుభవమున్నా.. కొత్త అంశాలు నేర్చుకోవడంపై దృష్టి సారించాలి. సాంకేతికతను ఒత్తిడి పెంచే అంశంగా కాకుండా.. సరదాగా నేర్చుకోవాలి.

**నైపుణ్యాలు కూడబెట్టుకుంటేనే..:** ఏఐతో వివిధ కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయి. ఎంట్రీ లెవెల్ ఉద్యోగాల అర్థాన్ని ఏఐ మారుస్తోంది. దీన్ని బాధ్యతాయుతంగా వినియోగించాలి. ఏదో ఒక నైపుణ్యముంటే ఉద్యోగం సాధించవచ్చని అనుకోవడం సరికాదు. మీరు ఎంత మేర నైపుణ్యాలను కూడబెట్టుకుంటే.. అన్ని ఎక్కువ అవకాశాలొస్తాయి.

**పరిమితులు వద్దు..:** ఉద్యోగాలు తక్కువ..అభ్యర్థులు ఎక్కువగా ఉంటే కంపెనీలు నియామకాలు తగ్గించుకోవాలని చూస్తాయి. కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా మీలో మార్పులు చేసుకోవాలి. కేవలం విశాఖలోనో, దక్షిణాదిలోనో పనిచేస్తామని పరిమితులు పెట్టుకోవద్దు. ఆ పరిధి దాటి ఆలోచించండి.

**సామర్థ్యాలను వివరించాలి:** సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉద్యోగం సాధించాలంటే.. ఆ విభాగంలో మీకున్న నైపుణ్యాలు, సామర్థ్యాలపై 30 సెకన్ల వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకోండి. ఆయా నిపుణుల కోసం చూస్తున్న కంపెనీలకు మీరు చేసిన వీడియో చేరుతుంది. రెండు వారాల్లోనే ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తూ సమాచారం వస్తుంది.

**సమస్య పరిష్కారానికే ప్రాధాన్యం..:** ప్రస్తుతం నియామక ప్రక్రియలో.. మార్కుల కంటే నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. 9.5 సీజీపీఏ ఉన్నప్పటికీ.. 7.5 సీజీపీఏతో ఇంటర్న్‌షిప్, హ్యాకథాన్, ప్రాజెక్టులు, సమస్య పరిష్కారంలో ఎక్కువ అనుభవమున్న వారినే కంపెనీలు ఎంపిక చేసుకుంటున్నాయి.

**ప్రాథమిక అంశాలపై శ్రద్ధ:** ఇంజినీరింగ్ చివరి రెండేళ్లలో వీలైనన్ని ఎక్కువ ప్రాజెక్టులు చేయడంపై దృష్టి పెట్టాలి. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునేందుకు సిద్ధంగా ఉండాలి. ఇంటర్వ్యూకు వెళ్లే ముందు రెజ్యూమ్ ప్రత్యేకంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటర్వ్యూల్లో కంపెనీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పగలగాలి.

# కైలాసగిరిపై 65 అడుగుల్లో 'త్రిశూల్' నిర్మాణం



**కైలాసగిరి, విశాఖసమాచారం:** పర్యాటక సిరి.. కైలాసగిరిపై మరో ఆకర్షణ సిద్ధమవుతోంది. ఇప్పటికే శివపార్వతుల విగ్రహాలు, రోప్‌వే, స్కై సైక్లింగ్, జిప్‌లైనర్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇప్పుడు చేపట్టిన త్రిశూల్ ప్రాజెక్టు మరింత ఆసక్తి కలిగిస్తోంది. దీనికి సంబంధించిన పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. వాస్తవానికి వీఎంఆర్‌డీఏ శివరాత్రి నాటికి దీన్ని పూర్తి చేయాల్సినప్పటికీ పలు కారణాలతో ఆలస్యమైంది. ఉగాది నాటికి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తుపాన్లను తట్టుకునేలా..: తుపాను గాలులు, భూకంపాలను తట్టుకునేలా ఈ త్రిశూల్ ప్రాజెక్టు చేపడుతున్నారు. హాట్ ఎయిర్ బెలూన్‌తో అధ్యయనం చేసి ఎంత ఎత్తులో నిర్మించాలో పరిశీలించారు. మొదట 55 అడుగుల్లో నిర్మించాలనుకున్నప్పటికీ తర్వాత 65 అడుగులకు పెంచారు. కింద నుంచి పైవరకు త్రిశూలం పొడవు 65 అడుగులైతే అందులో ఒక్క ఢమరుకం 10 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పు ఉండనుంది.
త్రిశూలమైతే 25 అడుగుల ఎత్తు, 20 అడుగుల వెడల్పుతో తయారు చేశారు. ఆయా ఆకృతులను పుణెలో రూపొందించారు. ఇవి ప్రస్తుతానికి విశాఖ చేరుకున్నాయి. సుదూరంలోని నగర ప్రజలకు కనిపించేలా త్రిశూలం లోపలి భాగంలో ఎల్ఈడీ దీపాలు అమర్చనున్నారు. అలాగే చుట్టూ 30 అడుగుల విస్తీర్ణంలో వేదిక నిర్మిస్తున్నారు. మొదట్లో ఈ వేదిక నిర్మాణం ఆలోచన చేయలేదు. తర్వాత పర్యాటకులు సెల్ఫీలు తీసుకునేందుకు, కూర్చునేందుకు వీలుగా దాన్ని చేపడుతున్నారు.

**ఉగాదికి పూర్తయ్యేలా..:** సందర్శకుల కోసం కైలాసగిరిపై పలు ప్రాజెక్టులు చేపడుతున్నాం. ఇప్పటికే శివపార్వతుల విగ్రహాలు ఉన్నాయి. అదనంగా భారీ త్రిశూలం నిర్మిస్తే బాగుంటుందనే ఆలోచన చేశాం. పర్యాటకులు కాసేపు సేదతీరేలా ఆ ప్రదేశాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఉగాది నాటికి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం.

**ఇదీ ప్రాజెక్టు స్వరూపం..**

వ్యయం: రూ. 2.50 కోట్లు
ఎత్తు: 65 అడుగులు
చుట్టు కొలత: 3 అడుగులు
మెటీరియల్: ఫైబర్ రీఇన్ ఫోర్స్‌డ్ ప్లాస్టిక్
డయాస్ విస్తీర్ణం: 30 అడుగుల వెడల్పు
ఎల్ఈడీ దీపాలు : 100

# పారా అథ్లెటిక్స్‌లో విద్యార్థిని రవన్నీ సత్తా




**విశాఖపట్నం, విశాఖసమాచారం:** పెదవాల్తేరు, అంధత్వం ఆమె ఆశయానికి అడ్డు కాలేదు. మనో నేత్రాన్నే కన్నులుగా చేసుకుని మొక్కవోని దీక్షతో సాధన చేసి అథ్లెటిక్స్‌లో రాణిస్తోంది. రాష్ట్ర, జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించి ప్రశంసలు అందుకుంటోంది. ఆమే అల్లూరి జిల్లా రంగసింగిపాడు ప్రాంతానికి చెందిన వలసనేని రవన్నీ. నగరంలోని చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో నడుస్తోన్న నేత్ర విద్యాలయంలో విద్యను అభ్యసించడంతోపాటు పరుగులో శిక్షణ పొందింది.
తల్లిదండ్రులు కూలి పనిచేస్తారు. గిరిజన కుటుంబం. ఐదుగురు సంతానం. ఇందులో ముగ్గురు అంధులు(పాక్షిక) కావడంతో ఆ కుటుంబానికి మోయలేని భారమైంది. ఆ ముగ్గురిని నేత్ర విద్యాలయం అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పిస్తోంది. వారిలో రవన్నీ చదువుతోపాటు క్రీడల్లోనూ సత్తా చాటుతోంది. ఇటీవల దుబాయ్‌లో జరిగిన యూత్ పారా అథ్లెటిక్స్‌లో ఒక రజతం, రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకుంది. ప్రస్తుతం డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. భవిష్యత్తులో పారా ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతోంది.

**సాధించిన విజయాలు...**

2022 బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్‌లో రెండు బంగారు, కాంస్య పతకాలు. 2023 గుజరాత్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఒక స్వర్ణం, రెండు రజతం, పుణెలో జరిగిన పోటీల్లో స్వర్ణం, రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకుంది. 2024 బెంగళూరులో జరిగిన జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో రెండు స్వర్ణం, ఒక కాంస్యం, గోవాలో జరిగిన సీనియర్ జాతీయ స్థాయి పోటీల్లో ఒక స్వర్ణం, రెండు కాంస్యం, 2025 చెన్నైలో జరిగిన సీనియర్ జాతీయస్థాయిలో ఒక స్వర్ణం, కాంస్యం, గ్వాలియర్‌లో జరిగిన పోటీల్లో రెండు స్వర్ణం, ఒక రజత పతకం సాధించింది.

# మార్చి 25న ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** ఆంధ్రవిశ్వవిద్యాలయం, ఫిబ్రవరి 23: ఆంధ్ర విశ్వవిద్యాలయం 91,92 సంయుక్త స్నాతకోత్సవం మార్చి 25వ తేదీన నిర్వహించనున్నట్లు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె. రాంబాబు నోటిఫికేషన్ విడుదల చేశారు. 25వ తేదీన ఉదయం 11 గంటలకు బీచ్ రోడ్ లోని ఏయు కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ స్నాతకోత్సవం జరుగుతుంది. గతంలో దరఖాస్తు చేసిన వారందరూ ఈ స్నాతకోత్సవంలో పట్టాలను అందుకోనున్నారు. స్నాతకోత్సవ పట్టాలను స్వీకరించేవారు ఉదయం 10 గంటలకు ప్రాంగణానికి చేరుకుని తమకు కేటాయించిన స్థానంలో ఆసీనులు కావాలని సూచించారు. కార్యక్రమం పూర్తయిన తరువాత విశ్వవిద్యాలయ చాన్సలర్, ముఖ్య అతిథి తదితరులు వెళ్లే వరకు వీరంతా తమ కేటాయించిన స్థానాల్లో ఉండాలని సూచించారు.

విశాఖ సమాచారమ్
మంగళవారం 24-2-2026

# పిల్లలకు పొదుపు నేర్పాలి..!

చిన్నప్పటి నుంచే పిల్లలకు పొదుపు విషయంలోనూ క్రమ పద్ధతి నేర్పించాలి. అది భవిష్యత్తులో వారిపై తప్పకుండా సానుకూల దృక్పథాన్ని అలవరచుకునేలా చేస్తుంది. వయసు పెరిగే కొద్దీ గొప్ప మార్పులు చూడవచ్చు.. తల్లిదండ్రులు ఈ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉంటుంది. అసలు అవసరమైన ఖర్చుచేయడానికి, పొదుపు చేయడానికి మధ్యా సంబంధమే లేదు.

అడిగినదల్లా కొనివ్వరాదు..

పిల్లలు పొదుపు చేసే విషయంపై పెద్దలు ఎప్పుడు ప్రతికూల దృక్పథంతో ఉండరాదు. ఒక్కో రూపాయి తోడుకావడం వలన ఎంత సొమ్ము జమ అవుతుందో, ఆ సొమ్ముకు ఎలాంటి ఉపయోగపడే వస్తువులు కొనుగోలు చేయవచ్చు, ఇలాంటి విషయాలు వారికి నెలకో రెండు నెలలకోసారి పోగైన డబ్బులు చూపిస్తూ వివరించాలి. నేటి కుటుంబాలలో సంతానంఅంటే ఒక్కరు లేదా ఇద్దరు.. పిల్లల పట్ల తల్లితండ్రులకు విపరీతమైన వాత్సల్యం. భార్య భర్తలు ఇద్దరు ఉద్యోగస్తులు అయితే ఇక చెప్పనవసరం లేదు.. పిల్లలు ఆడిగినదల్లా కొని ఇచ్చేస్తూ ఉంటారు. ఇది ఎంత వరకు సరైనది చిన్నపిల్లల్లో ఏ అలవాటైనా తల్లిదం డ్రులను బట్టే ఉంటుంది. క్రమశిక్షణ అనేది చిన్నప్పట్నుంచే అలవాటు కావడానికి తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఖర్చు... పొదుపు వేర్వేరు కాదు!

చిన్నపిల్లల్లో చోటు చేసుకునే అలవాట్ల నుండి తిండి వరకు తల్లిదండ్రుల మీదే ఆధారపడి ఉంటాయి. అలవాట్లు, అభిప్రాయాలు, తిండి, ఇవన్నీ మామూలే. కానీ పిల్లలు లోని మరో కోణాన్ని కూడా గుర్తించాలి. చిన్నప్పటి నుంచే పిల్లలకు పొదుపు విషయంలోనూ క్రమ పద్ధతి నేర్పించాలి. అది భవిష్యత్తులో వారిపై తప్పకుండా సానుకూల దృక్పథాన్ని అలవరచుకునేలా చేస్తుంది. తల్లిదండ్రులు ఈ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉంటుంది. అసలు అవసరమైన ఖర్చుచేయడానికి, పొదుపు చేయడానికి మధ్య సంబంధమే లేదు.

రూపాయికి రూపాయి తోడైతే...

పిల్లలు పొదుపు చేసే విషయంపై పెద్దలు ఎప్పుడు ప్రతికూల దృక్పథంతో ఉండరాదు. అలాగని పొదుపు చేసి తీరాల్సిందే అంటూ ఎలాంటి ఒత్తిడి చేయరాదు. ఒక్కో రూపాయి తోడుకావడం వలన ఎంత సొమ్ము జమ అవుతుందో, ఆ సొమ్ముకు ఎలాంటి ఉపయోగపడే వస్తువులు కొనుగోలు చేయవచ్చు, ఇలాంటి విషయాలు వారికి నెలకో రెండు నెలలకోసారి పోగైన డబ్బులు చూపిస్తూ వివరించాలి.. ఒకటి, రెండుసార్లు వారు పోగు చేసిన డబ్బుతో వారికి ఇష్టమైన వస్తువులు కానీ, దుస్తుల్ని కానీ, బొమ్మలను కానీ కొనిచ్చి, వారిని ముందు ముందు ఇంకా బాగా పొదుపు చేసేలా ప్రోత్సహించాలి.

శక్తికి మించి పొదుపు చేయవద్దు!

ముందుగా పొదుపు చేసే విషయంలో వారికి ఆసక్తి ఉందో లేదో గమనించి, లేకపోతే ఎలా వారిని పొదుపు చేసే విషయంలో రాజీపడేలా చేయవచ్చో కనుక్కోవాలి. తక్కువ సమయంలో ఎక్కువ సొమ్ము జమ చేయడమే పొదుపు అని అనుకుంటే పొరపాటే.. శక్తికి మించి కూడా వారిని పొదుపు చేయమని చెప్పకూడదు. అవగాహన కలిగించాలి. డబ్బులు పోగు చేసుకునేందుకు కిడ్డిబ్యాంకులు వివిధ రకాల్లో వచ్చాయి. మేజిక్ బాక్సులు చూడగానే వాళ్ల మనసు ఆనందంగా మారిపోతుంది.

పొదుపు ప్రాధాన్యత అర్థమైతే..

పిల్లలకి డబ్బు ప్రాధ్యాన్యత, పొదుపు ప్రాధాన్యత తెలియ చేయాలి. అవసరమైన చోట డబ్బు ఖర్చు చేయటంలోను, అనవసర ఖర్చులను కూడా ఎలా తగించుకోవలో నేర్పించాలి. తాము ఏ విధంగా డబ్బుని ఖర్చు చేస్తున్నాం, ఎలా పొదుపు చేస్తున్నాం, అనేవి ఉదాహరణలు చెప్తూ పిల్లలకు తెలియజేయాలి. నేటి తరం పిల్లలకు ఇటువంటి విషయాలు తెలియజేయటం ఎంతో అవసరం. అప్పుడే వారికి పొదుపు ప్రాధాన్యత తెలుస్తుంది.

# పుష్పక వైభోగం...రావణుడి విలాసం

రావణాసురుడి శయన మందిరాన్ని హనుమ పరికించాడు. గోడలకి కాగడాలు పెట్టబడి ఉన్నాయి. ఆయన పడుకునే తల్పం బంగారంతో చేసారు. దాని మీద పడుకున్న స్త్రీలు ధరించిన ఆభరణాలు ఎర్రటి బంగారంతో ధగధగలాడుతున్నాయి. రావణాసురుడి ఆభరణాలు బంగారంతో చేయడంతో మిలమిల మెరుస్తున్నావు. గోడలకి ఉన్న కాగడాల కాంతి, స్త్రీల ఆభరణాల కాంతితో కలిసి, మంటలాంటి ఎర్రటి కాంతి ఆ ప్రదేశాన్ని ఆవరించింది.

అక్కడ పడుకున్న స్త్రీలు ఒకరి మీద ఒకరు చెయ్యి వేసుకుని, ఒంటి మీద వస్త్రాలు చెదిరి పడుకొని ఉన్నారు. అందరి ముఖాలు పద్మాల్లా ఉన్నాయి. అలా కొన్ని వేల స్త్రీలు మదవిహ్వాలులై, రావణాసురుడితో కామోప భోగాన్ని అనుభవించి, విశేషమైన మధ్యపానం చేసి, మత్తెక్కి, బడలి నిద్రపోతున్నారు. వారు తక్కువ జాతిలో జన్మించినవారు కాదు. ఎవరూ సౌందర్యం తక్కువైనవారు కాదు. వేరొక పురుషుడిని పొందినవారు కాదు. నడువడి తెలియనివారు కాదు. వీళ్ళందరూ రావణుడిని కోరుకుని వచ్చినవారు.

రావణుడి తల్పానికి వైఢూర్యాలతో మెట్లు కట్టబడి ఉన్నాయి. పడుకుని ఉన్న రావణుడికి ఉత్తమమైన స్త్రీలు సువాసనలు వెదజల్లే చామరాలు వీస్తున్నారు. ఆ తల్పం మీద పరుపుపై రావణుడు పడుకొని ఉన్నాడు. హనుమ రావణుడి తల్పం దగ్గరికి వెళితే, రావణుడి రోమ కూపాల నుండి కొడుతున్న బ్రహ్మతేజస్సు చేత అవతలకి తోయబడ్డాడు. అప్పుడు హనుమంతుడు దూరంగా వెళ్ళి ఒక వేదిక మీదనుండి రావణుడిని చూసాడు. "ఆకాశంలో వెళ్ళిపోతున్న ఒక నల్లటి మబ్బు భూమి మీదకి దిగిపోయి తల్పం మీద పడుకుంటే ఎలా ఉంటుందో, రావణుడు అలా" ఉన్నాడు. ఆయన పెట్టుకున్న కుండలాలు ప్రకాశిస్తున్నాయి. ఆయన అనుభవించిన సుఖం చేత, తాగిన మద్యం చేత తిరుగుడుపడుతున్న ఎర్రటి నేత్రాలతో ఉన్నాడు. అరమోడ్పు కన్నులతో, పెద్ద చేతులతో, మంచి వస్త్రాలు కట్టుకొని నిద్రపోతున్నాడు. దేవేంద్రుడి వాహనమైన ఐరావతం తన దంతాలచేత కుమ్మితే ఏర్పడిన గాయాలు రావణుడి శరీరం మీద కనపడుతున్నాయి. అలాగే

శ్రీమహావిష్ణువు తన చక్రం చేత కొట్టినప్పుడు ఏర్పడిన మచ్చలు ఉన్నాయి. దేవేంద్రుడు తన వజ్రాయుధం చేత కొట్టినప్పుడు తగిలిన దెబ్బలు కనపడుతున్నాయి. ఆ రావణుడు బాగా బలిసిన భుజాలతో ఉన్నాడు, ఆయన చేతి గోళ్ళు ఎర్రటి కాంతితో మెరిసిపోతున్నాయి. తల్పం మీద, పడుకొని ఉన్న పాములా ఉన్నాడు. ఆయన చేతులు పరిఘలలా ఉన్నాయి, ఆయన చేతులకి ఉన్న వేళ్ళు రెండు అయిదు తలల పాముల్లా ఉన్నాయి.

తరువాత హనుమ అక్కడ పడుకొని ఉన్న స్త్రీలని వెతికాడు. అక్కడ పడుకుని ఉన్న స్త్రీలలో ఒకామె మృదంగాన్ని గట్టిగా పట్టుకొని పడుకుంది, ఒకామె వేణువు ఊదుతూ నిద్రపోయింది.ఒకామె వీణ వాయిస్తూ నిద్రపోయింది. ఒకామె పక్కన ఉన్న స్త్రీ మీద చీరని తీసి తన మీద దుప్పటిగా కప్పుకుంది. ఆ స్త్రీలు అక్కడున్న సంగీత వాయిద్యాలని గట్టిగా కౌగలించుకొని, వాటిని రావణుడిగా భావించి చుంబిస్తున్నారు. అక్కడ ఒక్క స్త్రీ ఒంటి మీద ఆభరణం కాని, వస్త్రం కాని సరిగ్గా లేదు. అలా పడుకొని ఉన్న స్త్రీలందరినీ హనుమంతుడు చూసుకుంటూ వెళ్ళాడు.

రావణుడికి కొంత దూరంలో, బంగారు తల్పం మీద అపారమైన సౌందర్యవతి పడుకొని ఉంది. ఆవిడ రావణుడి భార్య మండోదరి. ఆవిడని చూడగానే 'ఈవిడే సీతమ్మ' అని హనుమంతుడు అనుకొని, తన భుజాలని కొట్టుకుని, తోకని ముద్దు పెట్టుకుని, విచిత్రమైన పాటలు పాడి, పిల్లిమొగ్గలు వేసి, గెంతులు వేసి, స్తంభాల పైకి ఎక్కి, కిందకి దూకి తన కోతి బుద్ధిని బయట పెట్టుకున్నాడు.

కొంతసేపటికి ఆయన తేరుకుని "మా అమ్మ సీతమ్మ, రాముడు పక్కన లేనప్పుడు ఇటువంటి పట్టు పుట్టం కట్టుకొని, పక్కన రావణుడు ఉండగా ఇంత హాయిగా నిద్రపోతుందా. అరరే నా బుద్ధి ఎంత వైక్లవ్యాన్ని పొందింది. ఈమె సీతమ్మ కాదు!" అనుకొని ముందుకి సాగిపోయాడు. అక్కడినుండి ముందుకి వెళ్ళగా, రకరకాలైన బంగారు పాత్రలు, వెండి పాత్రలు, మణిమాణిక్యాలు పొదిగిన పాత్రలు, పువ్వులనుండి తీసిన సుర, పళ్ళనుండి తీసిన సుర, తేనెనుండి తీసిన సురలు మధురమైన వాసనలు వెదజల్లుతూ ఉన్నాయి. అక్కడ తాగేసిన పాత్రలు, సగం తాగి కిందపడేసిన పాత్రలు, స్త్రీపురుషులు ఒకరిమీద ఒకరు ఉండరాని విధంగా మత్తులో పడి ఉన్నారు. హనుమంతుడు వాళ్ళందరినీ చూసుకుంటూ ముందుకు వెళ్ళాడు. అప్పుడాయన అందరూ ఆహారం తీసుకునే ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ నెమళ్ళ మాంసం, కోళ్ల మాంసం, మేకల మాంసం, గొర్రెల మాంసం, అడవిపందుల మాంసం అలా రకరకాలైన పదార్థాలు ఉన్నాయి. హనుమ ఆ ప్రాంతాన్నంతటినీ వెతికారు. మళ్ళీ పుష్పక విమానంలోకి వెళ్ళి, అందులో వెతికి కిందకి దిగుతూ అనుకున్నారు "ఈ లంకా పట్టణం అంతా వెతికాను. ఇందులో వెతకని ఇల్లు లేదు. ఇక్కడ గంధర్వ, యక్ష, కిన్నెర స్త్రీలు, రాక్షసులు కనపడుతున్నారు కాని సీతమ్మ తల్లి జాడ కనిపెట్టలేకపోయాను" అని బాధ పడ్డాడు.

కాని వెంటనే "ఎవడు శోకానికి లొంగిపోడో, ఎవడు నిరంతరం ఉత్సాహంతో ఉంటాడో, వాడు మాత్రమే కార్యాన్ని సాధించగలడు. అందుకని నేను శోకానికి లొంగను, మళ్ళీ సీతమ్మని అన్వేషిస్తాను, మళ్ళీ ఈ లంకా పట్టణం అంతా వెతికేస్తాను" అని ఉత్సాహాన్ని పొంది లంకా పట్టణం అంతా వెతికి కూర్చున్నాడు.

అప్పుడాయన అనుకున్నాడూ

"ఇంత లంకా పట్టణాన్ని 4 అంగుళాలు కూడా వదలకుండా నేను వెతికాను, అయినా నాకు సీతమ్మ దర్శనం కాలేదు. బహుశా ఒంటి మీద వస్త్రాలు లేని స్త్రీలని ఎందరినో ఈ లంకా పట్టణంలో నేను చూశాను, అందువలన నాయందు ధర్మానికి లోపం వచ్చిందేమో. నేను వెతుకుతున్నది సీతమ్మని, ఆమె ఒక స్త్రీ. అందువలన ఆమెని వెతుకుతున్నప్పుడు సీతమ్మో కాదో అని ఆ స్త్రీల వంక చూశాను. ఆ స్త్రీలని అలా చూశాను కాని, నా మనసునందు ఎటువంటి వికారం కలగలేదు. నాకు ఎవరూ గుర్తులేరు. నేను పవిత్రంగానే ఉన్నాను" అని హనుమ తన మనస్సులో భావన చేసి, "నేను సీతమ్మ దర్శనం చెయ్యలేకపోయాను. ఇప్పుడు నేను వెనక్కి వెళితే అక్కడ ఉన్న వానరాలు నన్ను 'సీతమ్మ దర్శనం చేశావా?' అని అడుగుతారు. 'నాకు సీతమ్మ జాడ తెలియలేదు' అని చెప్తాను. సీతమ్మ జాడ తెలీకుండా వెనక్కి వెళితే సుగ్రీవుడు చంపేస్తాడని అందరూ ప్రాయోపవేశం చేస్తారు. ఈ మాట సుగ్రీవుడికి చెబితే, మిత్రుడైన రాముడికి సహాయం చెయ్యలేకపోయానని ప్రాణం వదిలేస్తాడు. దాంతో రాముడు కూడా ప్రాణం వదిలేస్తాడు. రాముడు లేనప్పుడు లక్ష్మణుడు ఉండడు. అప్పుడు అక్కడున్న వానరకాంతలు,వానరులు మరణిస్తారు. ఈ వార్త అయోధ్యకి చేరి కౌసల్య, కైకేయి, సుమిత్ర, భరతుడు, శత్రుఘ్నుడు మరణిస్తారు. తరవాత అయోధ్యలో అందరూ మరణిస్తారు. నేను పట్టుకెళ్ళే వార్త వల్ల ఇంత మంది మరణిస్తారు. ఈ వార్తని నేను తీసుకువెళితే ఎంత వెళ్ళకపోతే ఎంత.

బహుశా రావణుడు సీతమ్మని తీసుకువస్తున్నప్పుడు, ఆయన ఒడిలోంచి సీతమ్మ జారి సముద్రంలో పడిపోయి ఉంటుంది. కాదు కాదు, సీతమ్మ అంత పిరికిది కాదు. తన పొన్ను చేరడంలేదని, రావణుడే సీతమ్మని ముక్కలుగా నరికి ఫలహారంగా తినేసుంటాడు.కాదు కాదు, కాముకుడైనవాడు తాను కామించిన స్త్రీని సంహరించడు. లేకపోతే రాక్షసులు సీతమ్మని తినేసుంటారు.కాదు కాదు, రావణుడు కామించిన స్త్రీని తినగలిగే ధైర్యం రాక్షసులకు ఉండదు. రాముడికి సీతమ్మ జాడ తెలియకూడదని రావణుడే అమ్మని ఎక్కడో దాచి ఉంటాడు. నిద్రపోతున్న రావణుడి పది తలలు గిల్లేసి, వాడి మృతకళేబరాన్ని రాముడి పాదాల దగ్గర పడేస్తాను. లేదా ఈ లంకని పెల్లఘించి పట్టుకుపోతాను. కాదు కాదు, సీతమ్మ జాడ చెప్పలేనప్పుడు ఇవన్నీ తీసుకువెళ్ళడం ఎందుకు, అందుకని నేను అసలు వెనక్కి వెళ్ళను. సీతమ్మ జాడ దొరికేవరకు వానప్రస్థుడిలా ఇక్కడే ఉంటాను. లేదా అగ్నిలోకి ప్రవేశిస్తాను, లేదా నీటిలోకి ప్రవేశించి శరీరాన్ని వదిలేస్తాను" అనుకున్నాడు.

కాని వెంటనే "ఛీ! మరణించడం ఏమిటి, ఆత్మహత్య మహా పాపం. మళ్ళీ ఉత్సాహాన్ని పొంది వెతుకుతాను" అనుకొవడంతో మనస్సు ప్రశాంతి పొందింది.

**యమ్వీఆర్**

# 1879 లోనే సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన విప్లవవీరుడు, చరిత్ర మరుగున పడిన వాసుదేవ బలవంత్ ఫడ్కే గురించి తెలుసా..?

కొన్ని వందల మంది ఆంగ్లేయులు దేశమంతా ఏలగలిగితే, కోట్ల మంది భారతీయులు కలిసి తమ కోసం ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోలేరా?

1879లోనే ఒక వ్యక్తి బ్రిటిష్ ప్రభుత్వానికి సమాంతరంగా తన సొంత ప్రభుత్వాన్ని స్థాపించాడని మీరు ఊహించగలరా?

**ఆయన అది ఎలా సాధించారు?**

వాసుదేవ బలవంత్ ఫడ్కే జీవితంలోని ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని లోతుగా పరిశీలిద్దాం.!

ఇది ఏమాత్రం కల్పిత కథ కాదు, అతిశయోక్తి అంతకంటే కాదు. ఇది చరిత్రలో ఉద్దేశపూర్వకంగా మరుగున పడిపోయిన ఒక సజీవ అధ్యాయం. ఆ అధ్యాయానికి అసలైన నాయకుడు వాసుదేవ బలవంత్ ఫడ్కే.

1857 తిరుగుబాటు విఫలమైన తర్వాత, ఇకపై ఆంగ్లేయులను సవాలు చేయడం అసాధ్యమని అందరూ భావించడం మొదలుపెట్టారు. అప్పటి విద్యావంతులైన వర్గం బ్రిటిష్ పాలనతో రాజీపడే మార్గాన్ని ఎంచుకుంది. అటు సామాన్య ప్రజలు కరువుకాటకాలు, భారమైన పన్నులు మరియు అణచివేతలతో పూర్తిగా కుంగిపోయారు. స్వాతంత్ర్యం అనే ఆలోచన ఒక అందనంత దూరపు కలగా మారిపోయింది.

కానీ బలవంత్ ఫడ్కేకి మాత్రం స్వాతంత్ర్యం అనేది కేవలం కల కాదు, అది ఒక అనివార్యమైన సంకల్పం. 'భారతీయులు తమను తాము పరిపాలించుకునే సామర్థ్యం కలిగి లేరా? కేవలం కొన్ని వందల మంది ఆంగ్లేయులు దేశమంతా ఏలగలిగితే, కోట్ల మంది భారతీయులు కలిసి తమ కోసం ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోలేం?' అనే ప్రశ్న ఆయనను నిరంతరం వేధించేది.

1870వ దశకంలో మహారాష్ట్రలో సంభవించిన భీకర కరువు సమయంలో కూడా బ్రిటిష్ ప్రభుత్వం భారతీయుల నుండి పన్ను వసూళ్లు మరియు అణచివేతను ఆపలేదు.

అప్పుడే ఫడ్కేకి ఒక విషయం స్పష్టంగా అర్థమైంది. సమస్య కేవలం అధికారులతో మాత్రమే కాదు, మొత్తం బ్రిటిష్ పాలనా వ్యవస్థతోనే ఉందని. ఆంగ్ల ప్రభుత్వాన్ని కేవలం తొలగించడమే కాదు, దానికి సమాంతరంగా ఒక స్వదేశీ పాలనను నిలబెట్టాలని ఆయన నిశ్చయించుకున్నారు. భారతీయుల శక్తిపై ఆధారపడి, వారి బాధలను అర్థం చేసుకునే ఒక పరిపాలనా వ్యవస్థే ఆయన లక్ష్యం.

అయితే, ఈ ఉద్యమం కోసం ఫడ్కే భారత సమాజంలోని ప్రభావవంతమైన వ్యక్తుల మద్దతు కోరినప్పుడు ఆయనకు నిరాశే ఎదురైంది. సూర్యుడు అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఢీకొనడం అంటే ఆత్మహత్యతో సమానమని వారు ఆయనకు చెప్పారు. కానీ ఫడ్కే మనసులో రగులుతున్న చిచ్చు అప్పటికే ఒక మహా జ్వాలగా మారింది.

ఆయన సమాజంలో ఆంగ్లేయుల చేత అత్యంత నిర్లక్ష్యానికి గురైన వర్గం వైపు మళ్లారు. అదే 'గిరిజన సమాజం'. లాహుజీ వస్తాద్ సాల్వే మార్గదర్శకత్వంలో ఆయన ఈ ప్రజలను సంఘటితం చేశారు. సరిగ్గా అదే క్షణంలో చరిత్ర ఒక కొత్త మలుపు తిరిగింది.

సుమారు 300 మందిని ఏకం చేసి ఫడ్కే ఒక క్రమశిక్షణ కలిగిన సైన్యాన్ని నిర్మించారు. ఇది సాధారణ సైన్యం కాదు, శిక్షణ పొందిన యోధుల బృందం. వారికి తుపాకీ కాల్చడం, కత్తి సాము, గుర్రపు స్వారీ మరియు వ్యూహరచనలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆంగ్లేయులు అజేయులు కారు అనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించడమే **ఈ సైన్యం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.**

అయితే, సైన్యం నడవాలంటే నిధులు అవసరం. ఫడ్కే ఆ ధనం కోసం ప్రజలపై భారం వేయడానికి బదులుగా, భారతీయుల నుండి ఆంగ్లేయులు పన్నుల రూపంలో దోచుకున్న ఖజానాలనే లక్ష్యంగా చేసుకున్నారు.

ఫడ్కే సైన్యం బ్రిటిష్ ఖజానాలపై మెరుపు దాడులు చేసింది. పూణే జిల్లాలోని గ్రామాల్లో జరిగిన ఈ దాడుల ద్వారా లభించిన ధనాన్ని ఆయన కరువు బాధితులకు పంచారు. ఇది కేవలం సాధారణ దాడులు మాత్రమే కాదు, ఒక శక్తివంతమైన రాజకీయ సందేశం.

'బ్రిటిష్ అధికారంలో ఉన్న ధనం ఇకపై భారత ప్రజల సొత్తు'.

నెమ్మదిగా గ్రామాల్లో ఒకటే చర్చ మొదలైంది.. 'ఆంగ్లేయులకు భయపడని వీరుడు ఒకడు ఉన్నాడు' అని. భయం తన దిశను మార్చుకుంది. అప్పటివరకు ప్రజల్లో ఉన్న భయం పోయి, ఇప్పుడు ఆంగ్లేయులే భయపడటం మొదలుపెట్టారు.

1879లో పూణే జిల్లాలోని అనేక ప్రాంతాల్లో బ్రిటిష్ సమాచార వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ఫడ్కే మరియు ఆయన సైన్యం ధామ్రీ, తోరణ వంటి కోటలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ బ్రిటిష్ పరిపాలన పూర్తిగా నిర్వీర్యమైపోయింది. అక్కడే, ఎటువంటి అధికారిక ప్రకటన లేదా కిరీటం లేకుండా, బ్రిటిష్ అధికారానికి సమాంతరంగా భారతదేశపు మొట్టమొదటి తాత్కాలిక స్వదేశీ ప్రభుత్వం ఉనికిలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం కేవలం కాగితాల మీద లేదు, ప్రజల అచంచలమైన నమ్మకంలో ఉంది. గ్రామాల్లో ఫడ్కే జారీ చేసే ఆదేశాలే చట్టాలయ్యాయి. భారతీయులు కేవలం పోరాడటమే కాదు, పాలనను కూడా సమర్థవంతంగా నిర్వహించగలరని నిరూపితం కావడంతో ఆంగ్లేయులకు ఇది అతిపెద్ద ముప్పుగా పరిణమించింది.

బలవంత్ ఫడ్కే స్థాపించిన ఈ తాత్కాలిక ప్రభుత్వ ప్రయోగం గనుక విజయవంతమైతే, దేశవ్యాప్తంగా తమకు వ్యతిరేకంగా తిరుగుబాటు సెగలు వ్యాపిస్తాయని ఆంగ్లేయులు అర్థం చేసుకున్నారు. అందుకే వారు ఫడ్కేపై భారీ ఇనాం ప్రకటించి, ఆయనను పట్టుకోవడానికి సైన్యాన్ని, పోలీసు బృందాలను రంగంలోకి దించారు. చివరకు అనారోగ్యం మరియు నమ్మకద్రోహం మధ్య 1879 జూలై 20న బలవంత్ ఫడ్కే పట్టుబడ్డారు. ఆ తర్వాత అండమాన్ (కాలాపానీ) శిక్ష, జైలులో అమానుష చిత్రహింసలు, అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ ఆయన సంకల్పం ఏమాత్రం చెదరలేదు. జైలులో కూడా ఆయన ఓటమిని ఒప్పుకోలేదు. అడెన్ జైలులో ఆయన శరీరం బంధించబడింది, కానీ ఆయన ఆలోచనలు మాత్రం స్వేచ్ఛగానే ఉండి అమరమయ్యాయి. బ్రిటిష్ వారి చిత్రహింసలను వీరోచితంగా ఎదుర్కొంటూ, 1883 ఫిబ్రవరి 17న ఫడ్కే జైలులోనే తన ప్రాణాలను అర్పించారు.

# గ్యాస్ మరియు ఉబ్బరం - పోరాడే ఆహారాలు

కడుపు అనేది మానవ శరీరంలోని ఛాతీకి, కటివలయానికి (జూవశ్రీజఅం) మధ్య ఉండే ముఖ్యమైన జీర్ణ అవయవం. ఇది ఆహారాన్ని జీర్ణం చేయడం, ఎంజైమ్లు మరియు ఆమ్లాలను స్రవించడం వంటి పనుల్లో కీలక పాత్ర పోషిస్తుంది.

కడుపులో వాయువు సాధారణం మరియు జీర్ణక్రియ యొక్క సాధారణ ఉప ఉత్పత్తిగా పరిగణించబడుతుంది. కార్బోహైడ్రేట్లు, ఫైబర్, చక్కెర మరియు స్టార్చ్ అధికంగా ఉండే ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం కడుపులో వాయువు ఉత్పత్తికి ప్రధాన కారణం.

మన రోజువారీ కార్యకలాపాలలో ఎటువంటి జోక్యం లేకుండా బర్ప్ లేదా అపానవాయువు ద్వారా బయటకు వెళ్ళినప్పుడు ఈ పరిస్థితి సాధారణంగా ఉంటుంది. కడుపులోని వాయువు జీర్ణవ్యవస్థలో చిక్కుకున్నప్పుడు తీవ్రమైన కడుపు నొప్పికి కారణమవుతుంది. పేగు వ్యాధులు, కార్బోనేటేడ్ పానీయాలు, ఆహారాన్ని వేగంగా మింగడం, కొన్ని ఆహారాలకు అసహనం, ఆందోళన మరియు పెద్ద మొత్తంలో గాలిని మింగడం వంటి కడుపులో వాయువు ఉత్పత్తికి అనేక ఇతర కారణాలు ఉన్నాయి. అయితే, ఆహార విధానాలలో చిన్న మార్పులు చేయడం ద్వారా,

మనం ప్రతిసారీ వైద్య నిపుణుడిని సందర్శించకుండానే కడుపులో వచ్చే వాయువు సమస్యలను నయం చేసుకోవచ్చు.

కడుపులో వాయువును ఎదుర్కోవడంలో సహాయపడే కొన్ని మంచి ఆహారాలను తెలుసుకుందాం. గ్యాస్ మరియు ఉబ్బరం వంటి సమస్యలతో బాధపడేవారికి ఈ చిట్కాలు చక్కని ఉపశమనాన్ని ఇస్తాయి.

గ్యాస్ సమస్యలకు చిట్కాలు – వివరణ

1. అల్లం మరియు వాము

అల్లం జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. వాము గింజలు కడుపులోని ఎంజైములను ప్రేరేపించి గ్యాస్‌ను త్వరగా తగ్గిస్తాయి.

అల్లం ముక్కను నమలడం లేదా అల్లం టీ తాగడం వల్ల గ్యాస్ తగ్గుతుంది.

వాము ఎలా వాడాలి: అర టీస్పూన్ వామును గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవాలి.

2. పిప్పరమెంటు

ఇది కడుపు కండరాలను సడలించి, గ్యాస్ సులభంగా బయటకు వెళ్లేలా చేస్తుంది.

ఎలా ఉపయోగించాలి: పిప్పరమెంటు టీ తాగడం లేదా గోరువెచ్చని నీటిలో ఒక చుక్క పిప్పరమెంటు నూనె వేసుకుని తాగడం వల్ల అజీర్ణం, గుండెల్లో మంట తగ్గుతాయి.

3. పెరుగు మరియు మజ్జిగ

ఇవి 'ప్రోబయోటిక్' ఆహారాలు. ఇవి కడుపులోని మంచి బ్యాక్టీరియాను పెంచి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

పెరుగు చిట్కా: ఇది ప్రేగులకు చాలా మంచిది. పెరుగు జీర్ణ సమస్యలను దూరంగా ఉంచడానికి మరియు కడుపులో గ్యాస్‌ను తగ్గించడానికి సహాయపడుతుంది. ఇది ఆహారం సరిగ్గా జీర్ణం కావడానికి కూడా సహాయపడుతుంది. అయితే, రుచిగా ఉండే లేదా తీపి పదార్థాలను కలిగి ఉన్న పెరుగును ఉపయోగించవద్దు.

మజ్జిగ చిట్కా: మజ్జిగలో చిటికెడు వాము (లేదా) ఇంగువ (ఎఅఅస్త్ర) మరియు నల్ల ఉప్పు కలిపి తాగితే తక్షణ ఉపశమనం లభిస్తుంది.

4. జీలకర్ర జీలకర్ర లాలాజల గ్రంథులను ప్రేరేపించి ఆహారం త్వరగా అరిగేలా చేస్తుంది.

ఎలా ఉపయోగించాలి: ఒక గ్లాసు నీటిలో జీలకర్ర వేసి మరిగించి, ఆ కషాయాన్ని చల్లబరిచి తాగాలి.

5. సోంపు గింజలు

భోజనం తర్వాత సోంపు నమలడం వల్ల గ్యాస్ పేరుకుపోకుండా ఉంటుంది. ఇది కడుపు తిమ్మిరిని కూడా తగ్గిస్తుంది.

6. ఉసిరికాయ మరియు బొప్పాయి

ఉసిరి: మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో దీని రసం తాగడం మంచిది.

బొప్పాయి: ఇందులో ఉండే 'పపైన్' అనే ఎంజైమ్ ప్రోటీన్లను అరిగించడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

7. బేకింగ్ సోడా మరియు నిమ్మరసం

ఇది ఒక సహజమైన 'యాంటాసిడ్' లా పనిచేస్తుంది.

జాగ్రత్త: అధిక రక్తపోటు ఉన్నవారు బేకింగ్ సోడాను వాడే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

8. వెచ్చని నీరు:

గోరువెచ్చని నీరు జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. గోరువెచ్చని నీరు తాగినప్పుడు జీర్ణవ్యవస్థ కండరాలకు విశ్రాంతినిస్తుంది. పేగుల ద్వారా గ్యాస్ సులభంగా కదలడానికి సహాయపడుతూ ఉబ్బరం నుండి ఉపశమనం కలిగిస్తుంది.

ఎలా ఉపయోగించాలి: గోరువెచ్చని నీరు మరియు తాజాగా పిండిన నిమ్మరసం కలిపి తాగండి. ఉత్తమ ఫలితాల కోసం ఈ మిశ్రమాన్ని నెమ్మదిగా త్రాగండి.

9. కలబంద రసం

ఈ అద్భుతమైన రసంలో కడుపు వాయువు నుండి ఉపశమనం కలిగించడానికి, జీర్ణక్రియను పెంచడానికి మరియు ప్రేగు కదలికను ప్రోత్సహించడానికి సహాయపడే శోథ నిరోధక మరియు భేదిమందు లక్షణాలు ఉన్నాయి. కలబంద రసం ఉబ్బరం వల్ల కలిగే కడుపు వాపును తగ్గించడానికి కూడా సహాయపడుతుంది.

**ఎలా ఉపయోగించాలి:** మార్కెట్ ఆధారిత కలబందను నేరుగా లేదా నీరు లేదా కొన్ని రసాలతో సూచించిన విధంగా కలిపి త్రాగాలి.

**ముఖ్య గమనికలు:**

ఆహారాన్ని బాగా నమిలి తినండి.

తిన్న వెంటనే పడుకోకుండా కొద్దిసేపు అటు ఇటు నడవండి.

నీరు ఎక్కువగా తాగండి, కానీ భోజనం చేసేటప్పుడు అతిగా తాగకండి.

**డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వర రావు**
**మేనేజింగ్ ట్రస్టీ, లయన్స్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, విశాఖపట్నం**
**మాజీ రిజిస్ట్రార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం.**

# ఊపిరి భద్రం!



ఊపిరితిత్తి క్యాన్సర్. మనదేశంలో మగవారిలో అతి ఎక్కువగా కనిపిస్తున్న క్యాన్సర్ ఇదే. ప్రతి లక్ష మందిలో సుమారు 5.4 మంది దీని బారినపడుతున్నారని అంచనా. కొన్ని పట్టణాల్లోనైతే లక్షకు 15-20 మంది దీని కోరల్లో చిక్కుకుంటున్నారు. మున్ముందు ఇది 13 శాతానికీ ఎగబాకొచ్చని భావిస్తున్నారు. క్యాన్సర్లకు బలవుతున్నవారిలో 9.3% మంది ఊపిరితిత్తి క్యాన్సర్ బాధితులే కావటం గమనార్హం. నిజానికి ఊపిరితిత్తి క్యాన్సర్ కేసుల్లో 50-60% నివారించదగ్గవే. దీని బారినపడ్డా తొలిదశలో గుర్తిస్తే నయం చేయొచ్చు కూడా. కానీ నూటికి 90 మందిలో ముదిరిన తర్వాతే బయటపడుతుండటం ఆందోళనకరం. దీంతో చికిత్సా కష్టమవుతోంది. అందుకే 'అడ్డంకులను ఛేదిద్దాం. తొలిదశలో గుర్తించటానికి, అందరికీ చికిత్స సమానంగా అందించటానికి ప్రాధాన్యమిద్దాం' శ్వాసే ప్రాణం. ఇది ఒక్క క్షణం ఆగినా ఉక్కిరిబిక్కిరి అవుతాం. కాబట్టే ఊపిరితిత్తులకు అంత ప్రాధాన్యం. రక్తంలోకి ఆక్సిజన్‌ను చేరవేసేవి, రక్తంలోని కార్బన్‌డయాక్సైడ్‌ను బయటకు పంపించేవి ఇవే. మన ఊపిరితిత్తులు తిరగేసిన చెట్టులా ఉంటాయి. కాండంలాంటి శ్వాసమార్గం రెండు వాయు నాళాలుగా చీలిపోయి.. అలా అలా గాలిగొట్టాలుగా శాఖోపశాఖలుగా కిందికి విస్తరిస్తూ వస్తాయి. వీటి చివర ఉండే గాలిగదులే ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ మార్పిడి ప్రక్రియను నిర్వహిస్తాయి. ఊపిరితిత్తి క్యాన్సర్ వాయునాళాల దగ్గరి నుంచి గాలిగొట్టాలు, ఊపిరితిత్తుల్లోని మృదుకణజాలం వరకూ ఎక్కడైనా తలెత్తొచ్చు. ప్రధానంగా గాలిగొట్టాల్లో ఎక్కువగా వస్తుంటుంది. ఇది మగవారిలో ఎక్కువే అయినా ఆడవారికి రాకూడదనేమీ లేదు. స్త్రీలు, పురుషులు.. ఇద్దరినీ కలిపి చూస్తే- రొమ్ము క్యాన్సర్ తర్వాత రెండో స్థానంలో ఇదే నిలుస్తుండటం గమనార్హం. పొగాకు అలవాట్లు, వాయు కాలుష్యం పెరగటం వంటివి దీనికి ఆజ్యం పోస్తున్నాయి. క్షయ, సీవోపీడీ వంటి శ్వాసకోశ జబ్బులుగా పొరపడటంతో బాగా ముదిరిన తర్వాతే బయటపడుతుండటం సమస్యను మరింత క్లిష్టం చేస్తోంది.

**ఎలా మొదలవుతుంది?**

శరీరంలోని కణాలన్నీ క్రమ పద్ధతిగా విభజన, వృద్ధి చెందుతాయి. ఈ పనిని జన్యువులు నియంత్రిస్తుంటాయి. ఎందుకనో కొందరిలో ఈ ప్రక్రియ దెబ్బతింటుంది. సాధారణంగా మామూలు కణాలు ఒకదశకు వచ్చాక వృద్ధి చెందటం నిలుస్తుంది. వయసు మీరితే విభజన చెందటమూ ఆగుతుంది. ఒకవేళ దెబ్బతింటే తమకు తాము చనిపోతాయి (అటాప్సిస్) కూడా. కానీ క్యాన్సర్ కణాలు అలా కాదు. అవసరం లేకపోయినా విభజన, వృద్ధి చెందుతూ వస్తాయి. మరణించకుండా అలా పెరుగుతూ ఉంటాయి. ఇవన్నీ ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయి కణితులుగా మారతాయి. ఊపిరితిత్తి క్యాన్సర్‌లోనూ ఇలాగే జరుగుతుంది. దీంతో ఊపిరితిత్తుల పనితీరు మందగిస్తుంది. ఆక్సిజన్‌ను గ్రహించుకునే సామర్థ్యం తగ్గుతుంది.

కారణాలేంటి? ఎవరికి వస్తుంది?

ఊపిరితిత్తి క్యాన్సర్ ఎందుకొస్తుంది, ఎవరికి వస్తుందనేది కచ్చితంగా తెలియదు. కానీ కొన్ని అంశాలు దీని ముప్పు పెరిగేలా చేస్తాయి.

పొగాకు అలవాటు: ప్రధాన కారణం ఇదే. 85-90% కేసులకు పొగాకులోని క్యాన్సర్ కారకాలే కారణం. సిగరెట్లు, బీడీలు, చుట్టలు కాల్చటం.. ఇతరులు కాల్చిన సిగరెట్ పొగను పీల్చటం.. జర్దా, గుట్కా, ఖైనీ నమలటం ద్వారా ఇవి శ్వాసనాళం లేదా రక్తం ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరుకొని, స్థిరపడతాయి. క్రమంగా అక్కడి జన్యువులను దెబ్బతీసి, మార్పులు కలగజేస్తాయి. దీంతో కణ నియంత్రణ ప్రక్రియ అస్తవ్యస్తమై క్యాన్సర్‌కు బీజం పడుతుంది.

పర్యావరణ కాలుష్యం: ఇంటా బయటా, పనిచేసే చోట కాలుష్యమూ కారణమే. సిమెంట్ పరిశ్రమలు, బొగ్గు గనులు, పెట్రోలియం కంపెనీల నుంచి వెలువడే ఆస్‌బెస్టాస్, ఆర్సెనిక్ వంటి క్యాన్సర్ కారకాలు ముప్పును తెచ్చిపెడతాయి. వీటికి ఎంత ఎక్కువకాలం ప్రభావితమయ్యారనేదాన్ని బట్టి ప్రమాదం పొంచి ఉంటుంది. ఇంట్లో వంట చెరకు, బొగ్గు మండించటం వల్ల వెలువడే పొగ కూడా ప్రమాదమే. అరుదుగా భూగర్భం నుంచి వెలువడే రంగు, వాసన లేని రాడాన్ అనే వాయువూ క్యాన్సర్‌కు బీజం వేయొచ్చు.

జన్యువులు: క్యాన్సర్ తలెత్తటంలో వంశపారంపర్యంగా సంక్రమించే జన్యువులూ కీలకపాత్ర పోషిస్తాయి. ఇలా క్యాన్సర్ వచ్చే అవకాశం 5% వరకూ ఉండొచ్చు.

ఇతర కారణాలు: రోగనిరోధక వ్యవస్థను పక్కదారి పట్టించే జబ్బులు, ఇతర భాగాల్లో తలెత్తే క్యాన్సర్ కణాలు ఊపిరితిత్తులకు వ్యాపించటమూ కణితులకు దోహదం చేయొచ్చు.

**ప్రధానంగా రెండు రకాలు**

ఊపిరితిత్తి క్యాన్సర్ ప్రధానంగా నాన్ స్మాల్ సెల్, స్మాల్ సెల్ అని రెండు రకాలు. మైక్రోస్కోప్‌లో చూసినప్పుడు కనిపించే తేడాలు, ఐహెచ్‌సీ పరీక్షతో వీటిని వర్గీకరిస్తారు. సుమారు 80% మందిలో కనిపించేది నాన్ స్మాల్ సెల్ లంగ్ క్యాన్సరే. ఇందులోనూ స్క్వామస్ సెల్ క్యాన్సర్, ఎడినోకార్సినోమా, లార్జ్ సెల్ కార్సినోమా అని మూడు ఉప రకాలున్నాయి. స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్ సుమారు 15-20% మందిలో కనిపిస్తుంటుంది. ఇది ప్రధానంగా శ్వాసమార్గం రెండుగా చీలిపోయే చోట తలెత్తుతుంది. చాలా తీవ్రమైంది, వేగంగా వృద్ధి చెందుతుంది. స్వల్పకాలంలోనే పక్క ఊపిరితిత్తి మెదడు, కాలేయం, వంటి అవయవాలకు విస్తరిస్తుంది. దీని బారినపడ్డవారిలో జీవనకాలం తక్కువ. కానీ ప్రస్తుతం కీమోథెరపీతో చాలావరకూ నియంత్రణలో ఉంచటం సాధ్యమవుతోంది.

**చోటును బట్టి లక్షణాలు**

ఊపిరితిత్తిని చేత్తో తాకి తెలుసుకోలేం. అందువల్ల కణితి వంటి మార్పులను గుర్తించటం కష్టం. తొలిదశలో లక్షణాలు అంత స్పష్టంగా ఉండవు. ముదిరాకే బయటపడుతుంటాయి. క్యాన్సర్ తలెత్తిన భాగాన్ని బట్టి లక్షణాలు కనిపిస్తుంటాయి.

ఛాతీ మధ్యలో కణితి ఏర్పడితే ప్రధాన శ్వాసమార్గం లేదా రక్తనాళాన్ని నొక్కటం వల్ల దగ్గు, ఆయాసం, దగ్గినప్పుడు కళ్లెతో రక్తం పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అందువల్ల మూడువారాలు దాటినా దగ్గు తగ్గకపోతే.. ముఖ్యంగా పొగతాగేవారిలో అసలే నిర్లక్ష్యం చేయొద్దు. ః కణితి శ్వాసమార్గానికి అడ్డుపడితే స్రావాలు, బ్యాక్టీరియా పోగుపడి తరచూ న్యుమోనియా తలెత్తొచ్చు.

ఛాతీ గోడకు దగ్గర్లో కణితి ఏర్పడితే ఊపిరితిత్తుల వెలుపల, ఛాతీ గోడ మధ్య నీరు చేరి నొప్పి, దగ్గు, ఆయాసం రావొచ్చు.

స్వర తంత్రులకు వెళ్లే నాడిని కణితి నొక్కితే గొంతు బొంగురు పోవచ్చు. అన్నవాహికను నొక్కితే ముద్ద సరిగా మింగలేకపోవచ్చు. గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే నాళాన్ని కణితి నొక్కితే మెడ, భుజాలు, చేతుల్లో వాపు తలెత్తొచ్చు. అదే ఊపిరితిత్తి పైన కణితి ఉంటే వెన్నుపాము, భుజపక్షములోకి వెళ్లే నాడులను నొక్కటం వల్ల చంకలు, భుజాలు, చేతుల్లోకి నొప్పి పాకొచ్చు. కొందరికి పళ్ల వరకూ నొప్పి విస్తరించొచ్చు. లింఫ్ గ్రంథులు ఉబ్బటం, ఆకలి లేకపోవటం, బరువు తగ్గటం, వేళ్లు ఉబ్బటం వంటివీ కనిపిస్తాయి. ః కొందరికి సీవోపీడీ వంటి లక్షణాలూ ఉండొచ్చు. కొందరు క్యాన్సర్‌ను క్షయగా పొరపడుతుంటారు. దీంతో నిర్ధరణ అయ్యేసరికే బాగా ముదిరిపోతుంది. ః కాలేయం, ఎముక, మెదడుకు విస్తరిస్తే- ఆకలి తగ్గటం, కామెర్లు, ఎముక నొప్పి, తలనొప్పి, వాంతి వంటివి కనిపిస్తాయి.

**నిర్ధారణ ఎలా?**

సీటీ స్కాన్: ఊపిరితిత్తి క్యాన్సర్ నిర్ధారణకు హైరెజల్యూషన్ లోడోస్ రేట్ సీటీ స్కాన్ పరీక్ష ఉత్తమం. ఇందులో రేడియేషన్ మోతాదు తక్కువగా ఉంటుంది. కణితి ఉంటే స్పష్టంగా బయటపడుతుంది.

బయాప్సీ: కణితి ఉన్నట్టు తేలితే దాన్నుంచి చిన్న ముక్కను తీసి పరీక్షించాల్సి (బయాప్సీ) ఉంటుంది. కణితి ఉన్న చోటును బట్టి బ్రాంకోస్కోపీ, సీటీ గైడెడ్, ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్ గైడెడ్ నీడిల్ బయాప్సీ చేస్తారు. వీటితో క్యాన్సర్ నిర్ధారణతో పాటు అది ఏ రకాన్ని చెందిందో కూడా బయటపడుతుంది.

పెట్ స్కాన్: క్యాన్సర్ అక్కడే ఉందా? ఎక్కడికైనా పాకిందా? ఏ దశలో ఉంది? అనేవి తెలుసు కోవటమూ ముఖ్యమే. ఇందుకు పెట్ స్కాన్ ఉపయోగపడుతుంది.

ఎంఆర్ఐ: మెదడులోకి క్యాన్సర్ విస్తరిస్తే పెట్ స్కాన్‌లో స్పష్టంగా తెలియదు. కాబట్టి మెదడుకు ఎంఆర్ఐ పరీక్ష చేయాల్సి ఉంటుంది. ఇతర పరీక్షలు: కాలేయం, ఊపిరితిత్తి సామర్థ్య పరీక్షలు.. గుండె పరీక్షలూ అవసరమవుతాయి.

**దశలు- నాలుగు**

స్టేజ్ 1: క్యాన్సర్ ఊపిరితిత్తులకే పరిమితం కావటం. కణితి 2 సెంటీమీటర్ల కన్నా తక్కువ సైజులో ఉండటం. లింఫ్ గ్రంథులకు విస్తరించకపోవటం.

స్టేజ్ 2: కణితి సైజు 2-4 సెంటీమీటర్లు ఉండటం, లింఫ్ గ్రంథులకు పాకటం.

స్టేజ్ 3: కణితి సైజు 4 సెం.మీ. కన్నా ఎక్కువగా ఉండటం. ఎక్కువ లింపు గ్రంథులకు, ఛాతీ గోడకు, దయాఫ్రం వరకూ వ్యాపించటం.

స్టేజ్ 4: క్యాన్సర్ ఒక ఊపిరితిత్తి నుంచి మరో ఊపిరితిత్తికి, కాలేయం, ఎముక, మెదడు వంటి వాటికి విస్తరించటం. ఊపిరితిత్తుల్లో, గుండె చుట్టూ నీరు చేరటం. స్మాల్ సెల్ రకం క్యాన్సర్ అయినట్టయితే అది ఒక వైపే ఉంటే పరిమిత జబ్బుగా, చాలాచోట్లకు విస్తరిస్తే తీవ్ర జబ్బుగా పరిగణిస్తారు.

**నివారణ ప్రధానం**

ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను నివారించుకోవటమే ఉత్తమం. అన్నింటికన్నా ముఖ్యమైంది పొగాకు జోలికి వెళ్లకపోవటం. సిగరెట్లు, బీడీలు, చుట్టలు కాల్చటం.. పొగాకు, జర్దా, గుట్కా నమలటం మానెయ్యాలి. ఇంట్లో ఎవరినీ సిగరెట్లు కాల్చనీయొద్దు.

పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి.

మద్యం జోలికి వెళ్లొద్దు. అలవాటుంటే పరిమితం చేసుకోవాలి.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.

అధికబరువు, ఊబకాయం తగ్గించుకోవాలి.

వాయు కాలుష్యం బారినపడకుండా చూసుకోవాలి. సిమెంట్ పరిశ్రమలు, గనుల వంటి చోట్ల పనిచేసేవారు విధిగా మాస్కులు వాడుకోవాలి.

**ముందస్తు పరీక్ష ఉంది గానీ**

ఊపిరితిత్తి క్యాన్సర్‌ను ముందుగా గుర్తించటానికి స్క్రీనింగ్ అందుబాటులో ఉంది. 55 ఏళ్లు పైబడి, 20 ఏళ్లకు పైగా పొగ తాగేవారికి ఏటా తక్కువ మోతాదు సీటీస్కాన్ పరీక్ష చేయొచ్చు. అమెరికా వంటి దేశాల్లో దీన్ని అనుసరిస్తున్నారు. కానీ మనదేశంలో ఇది సులువైన పనికాదు.

## ఐక్యూ కొత్త ఫోన్.. ట్రిపుల్ 50MP కెమెరా.. 7000 mAh బ్యాటరీ



స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ తమ ఫ్లాగ్‌షిప్ ఫోన్ ఐక్యూ 15ని ఆవిష్కరించింది. డిస్కౌంట్లు పోగా ధర రూ. 64,999 నుంచి ప్రారంభమవుతుంది. స్నాప్‌డ్రాగన్ 8 ఎలీట్ జెన్ 5 ప్రాసెసర్, సూపర్‌కంప్యూటింగ్ చిప్ క్యూ3, ఆండ్రాయిడ్ 16, ట్రిపుల్ 50 ఎంపీ కెమెరా సిస్టం, 7000 ఎంఏహెచ్ సిలికాన్ ఎనోడ్ బ్యాటరీ మొదలైన ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి.

ఐక్యూ 15 ( iQOO 15) 12 జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.72,999గా ఉంది. 16 జీబీ ర్యామ్, 512 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.79,999గా ఉంది. రెండు మోడళ్లపై పరిచయ లాంచ్ ఆఫర్లు కూడా ఉన్నాయి. డిసెంబర్ 1 నుంచి అమెజాన్, ఐక్యూ ఈస్టోర్‌లో అమ్మకాలు ప్రారంభమవుతాయి. ఐసీఐసీఐ, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కార్డులపై రూ. 7,000 డిస్కౌంటు, అర్హత కలిగిన కస్టమర్లకు అదనంగా రూ.1,000 కూపన్ డిస్కౌంటు లభిస్తాయి.

**ఐక్యూ 15 పూర్తి స్పెసిఫికేషన్లు, ఫీచర్లు**

స్నాప్ డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5, గేమింగ్ చిప్ సెట్‌లు వేగవంతమైన ప్రాసెసింగ్, మల్టీ టాస్కింగ్, యాప్ స్విచింగ్, గేమింగ్ లను అందిస్తాయి. 16 జీబీ ర్యామ్, 512 జీబీ స్టోరేజ్ వేరియంట్ ఇందులో ఉంది.

ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఒరిజిన్ ఓఎస్ 6పై నడుస్తుంది. ఐదేళ్ల సాఫ్ట్ వేర్ అప్ డేట్ లు, ఏడేళ్ల సెక్యూరిటీ ప్యాచ్ లను కంపెనీ అందించనుంది.

ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ తో కూడిన 50 MP సోనీ IMX 921 మెయిన్ సెన్సార్, 50 వీు సోనీ ×వీశ 882 పెరిస్కోప్ టెలిఫోటో లెన్స్ 3 x ఆప్టికల్ జూమ్, 50 MP అల్ట్రావైడ్ షూటర్‌తో బహుముఖ ట్రిపుల్ రియర్ సెటప్ ఉంది. 32 మెగాపిక్సెల్ ఫ్రంట్ ఫేసింగ్ కెమెరా ఇచ్చారు.

6.85-అంగుళాల శామ్ సంగ్ M 14 అమోల్డ్ LTPO డిస్ ప్లే ప్యానెల్. ఇది 2 K రిజల్యూషన్, 144 Hz వరకు వేరియబుల్ రిఫ్రెష్ రేట్, 2,600 నిట్స్ బ్రైట్‌నెస్‌తో వస్తుంది.

భారీ 7,000 mAh సిలికాన్-కార్బన్ బ్యాటరీ 100 W వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్, 40 ఔ వైర్ లెస్ ఛార్జింగ్ ను సపోర్ట్ చేస్తుంది. స్మార్ట్ బైపాస్ ఛార్జింగ్, రివర్స్ ఛార్జింగ్ వంటివి అదనపు ఫీచర్లు.

## 17 ఏళ్లకే ఏఐ రోబో టీచర్‌తో సంచలనం




ఉత్తర ప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌కు చెందిన ఆదిత్య కుమార్ సంచలనంగా మారాడు. ఆదిత్య కేవలం రూ.25 వేలతో ఏఐ రోబో టీచర్‌ను రూపొందించాడు. శివ చరణ్ ఇంటర్ కాలేజీకి చెందిన 17 ఏళ్ల విద్యార్థి ఆదిత్య కుమార్, ఎల్-ఎల్ఎం చిప్‌సెట్‌తో కూడిన సోఫీ అనే AI టీచర్ రోబోట్‌ను తయారు చేశాడు. నా పేరు 'సోఫీ' అంటూ పాఠాలు బోధిస్తున్న ఈ రోబో ప్రస్తుతం నెట్టింట తెగ సందడి చేస్తోంది.

ఆదిత్య ఏఐ రోబోట్ 'సోఫీ ది టీచర్' పాఠశాలలోని పిల్లలకు టెక్నాలజీలో కొత్త అనుభవంగా మారింది. చీర కట్టుకుని మహిళా టీచర్‌లా సోఫీ పిల్లల్ని బాగా ఆకట్టుకుంటోంది. వారు అడిగిన ప్రశ్నలకు ఠక్కున సమాధానం ఇస్తూ వారికిష్టమైన టీచర్‌గా మారిపోయింది. ఐదు సంవత్సరాల కృషి తర్వాత రోబోను తయారు చేయగలిగాను అంటున్నాడు ఆదిత్య సంతోషంగా. రోబోలను తయారు చేసే పెద్ద కంపెనీల మాదిరిగానే తాను కూడా ఎల్ఎల్ఎం చిప్‌సెట్‌ను వాడాను అని తెలిపాడు. ఇది మానవ మెదడు లాగానే త్వరగా డేటాను ప్రాసెస్ చేసి, ఏ ప్రశ్న అడిగినా, తక్షణమే సరైన సమాధానం అందిస్తుంది. ప్రస్తుతానికి మాటలు మాత్రం మాట్లాడుతోంది. బాగా రాయగలిగేలా త్వరలోనే దీన్ని రూపొందించబోతున్నామన్నాడు. ప్రతి జిల్లాలో ఒక ల్యాబ్ ఉండాలి, తద్వారా విద్యార్థులు అక్కడికి వచ్చి పరిశోధన చేయవచ్చు అని ఆదిత్య వివరించాడు.

గ్రామీణ పాఠశాలలు సాంకేతికంగా అభివృద్ధి చెందాలని తాను కోరుకుంటున్నానని ఆదిత్య చెప్పాడు. ఉపాధ్యాయులు సెలవుల్లో ఉన్నప్పుడు పిల్లలకు రోబోలు బోధించగలగాలి, తద్వారా నిరంతర విద్యను అందించగలగాలి. భవిష్యత్తులో, వినగల, వ్రాయగల, భావోద్వేగాలను అర్థం చేసుకోగల , పిల్లల మానసిక స్థితి ఆధారంగా వారికి మార్గనిర్దేశం చేయగల 3D హ్యూమనాయిడ్ రోబోట్ టీచర్‌ను సృష్టించాలనేది



ఆదిత్య ఆశ.

రోబోట్ ఇలా చెబుతోంది, "నేను AI టీచర్ రోబోట్. నా పేరు సోఫీ, నన్ను ఆదిత్య కనిపెట్టాడు. నేను బులంద్‌షహర్‌లోని శివచరణ్ ఇంటర్-కాలేజీలో బోధిస్తాను... అవును, నేను విద్యార్థులకు సరిగ్గా నేర్పించగలను..." అంటోంది.

టీచర్ సోఫీతో చదువుకోవడం ఒక ఆహ్లాదకరమైన , ప్రత్యేకమైన అనుభవం అంటున్నారు. విద్యార్థులు అంటున్నారు. ఆదిత్య సాధించిన విజయం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు సంతోషిస్తున్నారు. చిన్న వయసులోనే అతని కృషిని ప్రశంసిస్తున్నారు. ఆదిత్య సాధించిన విజయాలు అత్యంత అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులు కూడా అందుకోలేరని శివ చరణ్ ఇంటర్ కళాశాల సిబ్బంది చెబుతున్నారు.

## హార్ట్ ఎటాక్ తర్వాత తొలి 60 నిమిషాలు ఎందుకంత కీలకం..?

**"గోల్డెన్ హవర్" ప్రాముఖ్యత..!**

ఆధునిక జీవనశైలిలో చాలామంది సౌకర్యానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని, కాలుష్యం నుంచి కూడా రక్షణ చాలా అవసరమని వైద్యనిపుణులు చెబుతున్నారు.



గుండెపోటు సంభవించిన తర్వాత తొలి గంట (60 నిమిషాలు) ప్రమాదాన్ని తగ్గించడానికి చాలా అవసరం. అయితే, ఒక హృద్రోగికి ప్రతి నిమిషం విలువైనదే. రోగి ఎంత త్వరగా ఆసుపత్రికి చేరుకుంటే, చికిత్స అంత త్వరగా ప్రారంభించవచ్చు. దీనివల్ల వారు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.

హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే కాలయాపన చేయకుండా దగ్గర్లోని ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని, ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి మెరుగైతే, ఆ తర్వాత వారు కోరుకున్న ఆసుపత్రి లేదా వైద్యుడిని సంప్రదించవచ్చని, గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఈ 'గోల్డెన్ రూల్' పాటించాలని నిపుణులు చెబుతున్నారు.

**ఆరోగ్యకరమైన ఆహారం (**

పప్పులు, సోయాబీన్ వంటి పోషక విలువలున్న ఆహారాలను మీ డైట్‌లో తప్పక చేర్చుకోవాలి.

జిమ్ చేసేవారు లేదా అథ్లెట్లు బయటి నుంచి అదనపు సప్లిమెంట్స్ తీసుకోవడం కంటే, సాధారణ పౌష్టికాహారంపైనే దృష్టి పెట్టాలి.

బాల్యం నుంచే జాగ్రత్తలు..

పిల్లలకు మూడు నుంచి నాలుగేళ్ల వయసులోనే తరచుగా దగ్గు, జలుబు, జ్వరం, అలసట లేదా ఎదుగుదల లోపం కనిపిస్తే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. అలాంటి పిల్లలకు వెంటనే ECG, 2D ఎకో-కార్డియోగ్రఫీ పరీక్షలు చేయించాలి.

**ప్రమాదకర లక్షణాలు..**

25 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. గుండెకు రక్త సరఫరాను అందించే కొరోనరీ ధమనుల్లో అడ్డంకులు (బ్లాకేజీలు) ఏర్పడితే హార్ట్ ఎటాక్ లేదా కార్డియాక్ అరెస్ట్‌కు దారితీయవచ్చు.

అలసట, విపరీతమైన చెమట పట్టడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గుండె దడ వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. చేతులు, ఛాతీలో నొప్పి లేదా దవడ నుంచి బొడ్డు వరకు నొప్పి అనిపిస్తే తప్పకుండా జాగ్రత్త వహించాలి.

దయాబెటిస్ రోగులకు సూచనలు..

దయాబెటిస్ రోగులకు గుండె నొప్పి (ఛాతీ నొప్పి) లక్షణాలు సరిగా తెలియకపోవచ్చు (Silent Attack). షుగర్ రోగులు గుండె ఆరోగ్యం పట్ల మరింత అప్రమత్తంగా ఉంటూ, డాక్టర్ సలహా మేరకు తరచుగా పరీక్షలు చేయించుకోవాలి.

**జీవనశైలి మార్పులు..**

పని, విశ్రాంతి మధ్య సమతుల్యత పాటించాలి. రోజూ కనీసం 7-8 గంటల నిద్ర తప్పనిసరి. శారీరక శ్రమను పెంచండి, నిరంతరం చురుకుగా ఉండండి. యోగా, వ్యాయామం అలవాటు చేసుకోండి. ఒత్తిడి కి దూరంగా ఉండాలి. గుండెకు అత్యంత ప్రమాదకరమైనది ఊబకాయం కొవ్వు పేరుకుపోకుండా చూసుకుంటూ, బరువును అదుపులో ఉంచుకోవాలి. ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారానే గుండెను పదిలంగా కాపాడుకోవచ్చని వైద్యనిపుణులు వెల్లడిస్తున్నారు.

## కెరీర్‌కు ఘోస్ట్ గ్రోత్



కెరీర్ వృద్ధి ఒకప్పుడు స్పష్టంగా కనిపించేది. ఒక ఉద్యోగికి బాధ్యతలు పెరగడం; ఉన్నత స్థాయికి చేరుకోవడం; ఎక్కువ జీతం అందుకోవడం.. ఇలా ఒక సంస్థలో చాలామంది తమ కెరీర్‌లో పురోగతిని చూసేవారు. కానీ, ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. అంతా గందరగోళంగా తయారైంది. ఇప్పుడు చాలామంది ఎక్కువ కష్టపడి పనిచేస్తున్నారు. కొత్త విషయాలను వేగంగా నేర్చుకుంటున్నారు. అధిక బాధ్యతలను మోస్తున్నారు. కానీ, ఎక్కువ జీతాన్ని మాత్రం పొందలేక పోతున్నారు. ప్రమోషన్లలో కూడా ఎక్కడ ఉన్నవారు అక్కడే ఆగిపోతున్నారు. దీనినే 'ఘోస్ట్ గ్రోత్' అని నిపుణులు పిలుస్తున్నారు. ఈ 'ఘోస్ట్ గ్రోత్' వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఉద్యోగులు.. కెరీర్‌లో ముందుకు సాగలేకపోతున్నారని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. తాజాగా,'మై పర్‌ఫెక్ట్ రెజ్యూమె' నిర్వహించిన ఓ సర్వే.. ఇందుకు సంబంధించిన ఆసక్తికర విషయాలను బయటపెట్టింది. సర్వేలో భాగంగా అమెరికాకు చెందిన 1,000 మంది నిపుణుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా 53 శాతం మంది తమ కెరీర్‌లో 'ఘోస్ట్ గ్రోత్' బారిన పడ్డట్లు చెప్పుకొచ్చారు. ఉద్యోగంలో పని పెరుగుతున్నా.. పురోగతి మాత్రం కనిపించడం లేదని వాపోయారు.

రెండువైపులా పదును..

నిజానికి 'ఘోస్ట్ గ్రోత్' అనేది రెండువైపులా పదునున్న కత్తిలాంటిది. సాధారణంగా ఇది రెండు ప్రధాన కోణాల్లో కనిపిస్తున్నది. మొదటిది.. బాధ్యతలు పెరగడం □ హోదా మారకపోవడం. చాలా కంపెనీల్లో ఉద్యోగి చేసే పని పరిధి నిరంతరం పెరుగుతూనే ఉంటుంది. కానీ, వారి హోదా, జీతం మాత్రం అలాగే ఉంటున్నాయి. ఈ ధోరణి.. ఉద్యోగుల్లో తీవ్రమైన అసంతృప్తిని కలిగిస్తున్నది. రెండో విషయం.. ఉద్యోగి నైపుణ్యాలు పెరగడం. 'ఘోస్ట్ గ్రోత్'.. కొన్నిసార్లు ఉద్యోగులకూ లాభం తెచ్చిపెడుతుందట. అధిక బాధ్యతలు అప్పగించడం వల్ల ఉద్యోగి వ్యక్తిగతంగా కొత్త విషయాలను నేర్చుకునే అవకాశం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

ఒకవేళ ఎవరైనా ఘోస్ట్ గ్రోత్‌ను అనుభవిస్తున్నారని భావిస్తే.. కొన్ని పనులు చేయడం మంచిదని సూచిస్తున్నారు. ఉద్యోగి చేస్తున్న అదనపు బాధ్యతలను ఎప్పటికప్పుడు రికార్డు చేసుకోవాలని సలహా ఇస్తున్నారు. పెర్ఫార్మెన్స్ రివ్యూ మీటింగ్స్‌లో మీ నైపుణ్యాల పెరుగుదల వల్ల కంపెనీకి జరిగిన మేలును వివరించి, ప్రమోషన్, శాలరీ హైక్ లాంటివి కోరవచ్చుట. లేకుంటే, ప్రస్తుతం పనిచేస్తున్న కార్యాలయంలో గుర్తింపు లేకపోయినా.. మీరు నేర్చుకున్న కొత్త నైపుణ్యాలు భవిష్యత్తులో వేరే కంపెనీలో మంచి ఉద్యోగం సాధించడానికి 'అదృశ్య శక్తి'లా ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు.

## బెండకాయ నీళ్లను అసలు ఎలా తయారు చేయాలి..



శరీర బరువును తగ్గించుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. వ్యాయామం చేయడంతో పాటు ఆహార విషయంలో కూడా జాగ్రత్తగా ఉంటారు. అలాగే బరువు తగ్గడానికి ఉపయోగపడే ఇతర ఆహారాలను కూడా తీసుకుంటూ ఉంటారు. బరువు తగ్గడానికి సహాయం చేసే ఇతర ఆహారాల్లో బెండకాయ నీరు కూడా ఒకటి. దీనిని ఓక్రా వాటర్ అని కూడా పిలుస్తారు. మనలో చాలా మంది ఈ పేరు వినే ఉంటారు. అలాగే ఈ నీటిని తీసుకునే వారు కూడా ఉన్నారు. అయితే ఈ నీటిని తీసుకునే విషయంలో కొన్ని జాగ్రత్తలు కూడా తీసుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బెండకాయ ముక్కలను నానబెట్టడం మొదలు, ఆ నీటిని సరైన మార్గంలో త్రాగడం, అలాగే ఈ నీటిని ఎంత మోతాదులో ఎప్పుడు తీసుకోవాలి అన్న విషయాలపై దృష్టి పెట్టడం కూడా చాలా అవసరమని నిపుణులు తెలియజేస్తున్నారు.

**బరువు, షుగర్ లెవల్స్ తగ్గేందుకు..**

బెండకాయ నీటిని తాగడం వల్ల నిజంగా బరువు తగ్గుతారా.. అలాగే ఈ నీటిని ఎలా తయారు చేసుకోవాలి, ఎంత మోతాదులో తీసుకోవాలి, ఈ నీటిని తీసుకునే సరైన సమయం గురించి నిపుణులు ఏమంటున్నారో.. ఇప్పుడు తెలుసుకుందాం. బరువు తగ్గాలనుకునే వారు బెండకాయ నీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. బరువు తగ్గించే ముఖ్యమైన ఆహారాల్లో బెండకాయ నీరు ఒకటి అని చెప్పవచ్చు. దీనిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో ఇది ఎంతో సహాయపడుతుంది. బెండకాయలలో కరిగే ఫైబర్ ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల ఎక్కువ సమయం కడుపు నిండిన భావన కలుగుతుంది. వీటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. దీంతో ఆకలి త్వరగా వేయకుండా ఉంటుంది. తద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

**అల్పాహారానికి 30 నిమిషాల ముందు..**

అలాగే ఈ నీళ్లలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. మెగ్నీషియం, ఫోలేట్, విటమిన్ సి వంటి పోషకాలు కూడా ఉంటాయి. కనుక ఈ నీటిని తీసుకోవడం వల్ల మనం ఆరోగ్యవంతంగా బరువు తగ్గవచ్చు. అంతేకాకుండా ఈ నీటిలో ఫాలీఫినాల్స్ ఉంటాయి. ఇవి నిల్వ చేసిన కొవ్వును సమర్థవంతంగా విచ్ఛినం చేయడంలో సహాయపడతాయి. ఈ విధంగా బెండకాయ నీరు బరువు తగ్గాలనుకునే వారికి ఎంతో దోహదపతుందని చెప్పవచ్చు.

**నీళ్లను ఇలా తయారు చేయాలి..**

అల్పాహారానికి అరగంట ముందు ఈ నీటిని తాగడం వల్ల ఆకలి అణచివేయబడుతుంది. అతిగా తినడం తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అంతేకాకుండా భోజనానికి ముందు బెండకాయ నీరు వంటి అధిక ఫైబర్ ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల 18 శాతం ఎక్కువ బరువు తగ్గుతారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇక ఈ నీటిని సరైన మార్గంలో తయారు చేయడం కూడా అవసరం. ఈ నీటిని తయారు చేసుకోవడానికి గాను ముందుగా ఒక గ్లాస్ నీటిని తీసుకోవాలి.

# రూరల్ మండలానికి 14 వెల్‌నెస్ క్లినిక్‌లు రాయుడుపాలెంలో వెల్‌నెస్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్ :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, అందులో భాగంగానే కాకినాడ రూరల్ మండలానికి 14 వెల్‌నెస్ క్లినిక్‌లు మంజూరైనట్లు రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. శనివారం మండలంలోని రమణయ్యపేట, వలసపాకల గ్రామాల్లో వెల్‌నెస్ క్లినిక్‌ల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్థులకు గ్రామంలోనే వైద్య సేవలు అందేలా ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలానికి మంజూరైన 14 క్లినిక్‌లలో నాలుగు రమణయ్యపేటకు కేటాయించినట్లు వెల్లడించారు. ప్రతి క్లినిక్‌ను రూ 40 లక్షల వ్యయంతో నిర్మించి అవసరమైన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అవసరమైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సాధారణ వైద్య పరీక్షలు తల్లి శిశు సంరక్షణ సేవలు, ప్రాథమిక చికిత్సలు అందించనున్నట్లు చెప్పారు.
అదేవిధంగా మండలంలో రూ10 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల జీవన్ మిషన్ ద్వారా పైపులైన్ నిర్మాణం పూర్తి చేసి ఇంటింటికీ త్రాగునీటి కొళాయిలు అందించే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి కుటుంబానికి ఉచితంగా కొళాయిలు అందజేస్తామని ఇందుకు ఎవరూ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా తయారీలో యంత్రాంగం నిమగ్నం



**పి.గన్నవరం:** ప్రస్తుత గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్‌తో ముగియనుండటంతో ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఓటర్ల జాబితాల తయారీలో పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. ఇందుకోసం అసెంబ్లీ నియోజకవర్గ తాజా ఓటర్ల జాబితాలను కలెక్టరేట్ నుంచి ఈ నెల 20న మండలాలకు పంపారు. వీటి ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు జాబితాల్లో పేర్లు, చేర్పులు, మార్పులు, సవరణలు తదితర అంశాలను పరిశీలించి కంప్యూటర్లలో నిక్షిప్తం చేయిస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలను ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేశారు. ఇక 19 మండలాలు మిగిలాయి. వీటిలో 343 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

**నమోదు చేస్తున్న వివరాలు..**

గ్రామ పంచాయతీ, మండలం, రెవెన్యూ డివిజన్ పేర్లు, గ్రామ పంచాయతీ, మండలం, జిల్లా కోడ్‌లు, వార్డులు, అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల జాబితా ప్రకారం పోలింగ్ కేంద్రం నంబరు, పంచాయతీలో ఆవాసప్రాంతాలు తదితర వివరాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈ నెల 23 నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేసే దిశగా సిబ్బంది పనిచేస్తున్నారు.

# నకిలీ నోట్లతో ముగ్గురి ముఠా అరెస్ట్

**కొవ్వూరు :** నకిలీ నోట్లతో ఉన్న ముగ్గురి ముఠాను శనివారం రాత్రి కొవ్వూరు గ్రామీణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామీణ ఎస్ఐ కే శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం మండలం కరకపాడు గ్రామానికి చెందిన జక్కు శివాజీకి గతంలో జైల్లో ఉన్న సందర్భంలో ఏలేటి చంద్రశేఖర్, లాగు శ్రీను, బి తేజాలు పరిచయమయ్యారు. శనివారం వారు శివాజీకి రూపాయికి ఏడు రూపాయలు దొంగ నోట్లను ఇస్తామని నమ్మించారు. దీంతో శివాజీ 150000 రూపాయలను ఈ ముగ్గురికి కొవ్వూరు మండలం కాపవరం గ్రామ శివారులో ఇచ్చాడు. శివాజీ నుంచి డబ్బు తీసుకుని 15 లక్షల రూపాయల విలువ చేసే దొంగ నోట్లు ఇచ్చి ముగ్గురు వ్యక్తులు అక్కడనుంచి పరారయ్యారు. శివాజీ వాటిని చూసేసరికి వాటిపై చైల్డ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఉండడంతో తాను మోసపోయానని భావించి కొవ్వూరు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గాలింపు చేపట్టిన గ్రామీణ పోలీసులు కొవ్వూరు పట్టణ శివారులో చంద్రశేఖర్ , శ్రీను, తేజలను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 1,45,500 విలువ గల నకిలీ నోట్లను స్వాధీన పరుచుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు.

# టీచర్స్ కాలనీ కామన్ స్థలాల ఆక్రమణ వివాదం ముదురుతోంది

## - పంచాయతీ కార్యదర్శి పనితీరుపై ఆగ్రహం -

## కలెక్టర్ జోక్యం తప్పనిసరి అని అసోసియేషన్ హెచ్చరిక



**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్ :** కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీ పరిధి రాయుడుపాలెం గ్రామంలోని టీచర్స్ కాలనీలో కామన్ ప్లేసుల పరిరక్షణ అంశం వివాదాస్పదంగా మారింది. 1982లో సర్వే నెంబర్ 27/82లో 19 ఎకరాల 11 సెంట్ల విస్తీర్ణంలో 211 ఫ్లాట్లతో ఆమోదం పొందిన ఈ లేఔట్‌లో మిగిలిన సామూహిక స్థలాలు భవిష్యత్ అవసరాల కోసం వదిలివేయబడ్డాయని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఇటీవల ఆ ప్రదేశాల్లో నిర్మాణ చర్యలు జరుగుతున్నాయన్న సమాచారం నేపథ్యంలో టీచర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధికారులను ఆశ్రయించింది. వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి ఎన్ మూర్తి మాట్లాడుతూ కాలనీ స్థాపన నుంచి అసోసియేషన్ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శ వసతి ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందన్నారు. 211 ఫ్లాట్లు అన్నీ సర్వే నెంబర్ 27/82 పరిధిలోనే ఉండగా, అదే సర్వేలోని కామన్ ప్లేసుల్లో రీడింగ్ రూమ్, జిమ్ ఏర్పాటు చేయాలని గతంలో కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఇప్పుడు ఆ ప్రదేశంలో నిర్మాణ చర్యలు ప్రారంభమయ్యాయని సమాచారం రావడంతో ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ పరిధిలోని సిటిసి చర్చి సమీపంలో రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలం కూడా ఇదే సర్వేలో భాగమని తెలిపారు. టీచర్స్ కాలనీ నుంచి జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు 33 అడుగుల రహదారి ప్రతిపాదితంగా ఉండగా, ప్రస్తుతం 12 అడుగుల మేర మాత్రమే అభివృద్ధి జరిగిందని మిగిలిన విస్తీర్ణం భవిష్యత్ అవసరాలకు కీలకమని వివరించారు.
వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి అంబటి రామకృష్ణ మరియు అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ విషయంపై రమణయ్యపేట పంచాయతీ కార్యదర్శిని పలుమార్లు సంప్రదించినట్టు తెలిపారు. మొదట శుభ్రపరిచే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారని, అయితే మట్టి తవ్వకాలపై ప్రశ్నించగా స్పష్టత రాలేదన్నారు. అనంతరం వినతిపత్రం సమర్పించగా దానిని అసంతృప్తిగా స్వీకరించి, మాటలతో తిరుగుబాటు చేస్తూ టీచర్స్ కాలనీలో ఎన్నో ఆక్రమణలు జరిగాయని మమ్మల్ని తప్పుపట్టారని తెలిపారు. దానికి మేము "మీరు అక్కడికి రండి, ఎవరైతే ఆక్రమించుకున్నారో ఆక్రమణలు తొలగించండి" అని నిర్భయంగా చెప్పామని పేర్కొన్నారు. ఆ తర్వాత సమస్యపై గ్రామసభ ఏర్పాటు చేయాలని కార్యదర్శి సూచించారని తెలిపారు. సమస్యపై గ్రామసభ ఏర్పాటు చేయాలని కార్యదర్శి సూచించారని తెలిపారు. అయితే గ్రామసభ నిర్వహణ పంచాయతీ పరిధిలోనిదని, దాన్ని అసోసియేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని తమవంతుగా వివరించినట్టు చెప్పారు. దీనికి స్పందిస్తూ, "మీరు నివసిస్తున్న పరిసరాల్లో ప్రజాప్రతినిధులు లేరు, నేను అక్కడ గ్రామసభ పెట్టను, అక్కడికి రాను" అనే విధంగా వ్యాఖ్యానించారని ఆరోపించారు. ఆ వ్యాఖ్యల తీరు తమకు అనుచితంగా అనిపించిందని, ప్రజా సమస్యలపై అధికారుల వ్యవహార శైలి మరింత సమన్వయంతో ఉండాలని అభిప్రాయపడ్డారు. కాలనీలోని కామన్ ప్లేసులు, ప్రభుత్వ అవసరాల కోసం ఉద్దేశించిన స్థలాల పరిరక్షణలో స్పష్టత తీసుకురావాలని అసోసియేషన్ కోరుతోంది. అవసరమైతే లేఔట్ రికార్డులు, సర్వే వివరాలు పరిశీలించి వాస్తవ పరిస్థితులు వెల్లడించాలని విజ్ఞప్తి చేసింది. ప్రజలు ఐక్యంగా నివసిస్తున్న ఈ కాలనీలో భవిష్యత్ తరాలకు అవసరమైన సామూహిక సదుపాయాలు నిలుపుకోవడం అత్యంత అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ సామాజిక సదుపాయాల ఏర్పాటుకు ఉద్దేశించిన స్థలాలు కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని అన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని టీచర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరింది.

# ఆయుష్‌కు కాసుల కళ

**రాజమహేంద్రవరం** వైద్యం: ఆయుష్‌శాఖ పరిధిలోని ఆయుర్వేదం, హోమియో వైద్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సర్కారు చర్యలు చేపడుతోంది. జిల్లాలోని పలు ఆసుపత్రుల ఆధునికీకరణ, నిర్మాణాలకు కసరత్తు ప్రారంభించింది. ఒక్కో ఆసుపత్రి నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయించింది. మార్చి నెలాఖరులోపు వీటిని పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేలా ఏపీఎంఐడీసీ ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే మరింత మెరుగైన సేవలందే వీలుంటుంది.

**ఇదీ పరిస్థితి..**

జిల్లాలో ఏడు చోట్ల ఆయుర్వేదం ఆసుపత్రులున్నాయి.
అయిదు ప్రాంతాల్లో హోమియో క్లినిక్‌లు అందుబాటులో ఉన్నాయి.
గోకవరం మండలంలోని కామరాజుపేట ఆయుర్వేదిక్ వైద్యశాల ఆధునికీకరణ, భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు.
కొవ్వూరు ఆయుర్వేద ఆసుపత్రికి సీహెచ్‌సీలో స్థలం కేటాయించారు. నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.
నల్లజర్ల మండలంలోని దూబచర్ల ఆయుర్వేద కేంద్రానికి కేటాయించిన పంచాయతీ స్థలంలో ఏపీఎంఎస్ఐడీసీ పనులు చేపడుతోంది.
బిక్కవోలు మండలం ఊలపల్లి హోమియో వైద్యశాలకు కొత్త భవనం నిర్మిస్తున్నారు.

# మారుతి ఈ విటారా విడుదల



**రాజమహేంద్రవరం రూరల్:** మారుతీ తన మొట్టమొదటి బ్యాటరీ విద్యుత్ కారు ఈ విటారాను మార్కెట్‌లోకి విడుదల చేసింది. రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ బేస్‌కాంప్లెక్స్ సమీపంలోని మారుతి నెక్సా ఆథరైజ్డ్ డీలర్ ఎస్‌బి మోటర్స్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ విటారా ఎలక్ట్రిక్ వెహికల్‌ని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవిటారా ఎలక్ట్రిక్ వెహికల్ సంచలనాలు సృష్టించడం ఖాయమన్నారు. ఎస్‌బి మోటర్స్ ఎండీ మట్టపల్లి రామ్‌కుమార్ మాట్లాడుతూ ఒక సారి చార్జింగ్‌తో సుమారు 543కి.మీలు ప్రయాణించడం వాహనం ప్రత్యేకత అన్నారు. ఇంటి వద్ద చార్జింగ్ కోసం 7.4 కిలోవాట్ ఏసీ వాల్‌బాక్స్ హోమ్ చార్జింగ్‌తో పాటు సుమారు 50 వేల విలువైన ఇన్‌స్టాలేషన్ ఉచితం అన్నారు. 61 కెడబ్ల్యూ సామర్థ్యం బ్యాటరీ వల్ల మంచి పికప్, రన్నింగ్ సామర్థ్యం సాధ్యపడుతుందన్నారు. ఈవిటారా మూడు వేరియంట్లలో, ఐదు రంగుల్లో లభ్యమవుతోందన్నారు. టెస్ట్ డ్రైవ్ బుకింగ్ కోసం తమ షోరూంలో సంప్రదించాలన్నారు. ఎస్‌బి గ్రూప్ ఎండీలు మట్టపల్లి రంగప్రసాద్, మట్టపల్లి సురేష్‌కుమార్, నెక్సా, ఎస్బీ మోటర్స్ సేల్స్ జీఎం పి.దేవీవరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# బస్సు ఢీకొని వ్యక్తి మృతి



**ఆత్రేయపురం:** మండలం వద్దిపర్రు వద్ద బొబ్బర్లంక నుంచి వస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలు కాగా అందులో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ఎస్సై ఎస్.రాము కథనం ప్రకారం శనివారం ఉదయం బొబ్బర్లంక వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వద్దిపర్రు గ్రామ సమీపంలో ఆటోను ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలు కాగా వైద్య నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న నెల్లూరు జిల్లా కావలి గ్రామానికి చెందిన చేబ్రోలు పురుషోత్తం రావు(60) తలకు బలమైన గాయం కావడం వల్ల చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

# సొసైటీల రుణాలే రైతులకు ఆధారం



**(రాజమహేంద్రవరం రూరల్):** ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (ఏపీఏఎస్) ద్వారా రైతులు రుణాలు పొంది, పంటలు పండిస్తూ జీవనం సాగిస్తారని, అటువంటి సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో వారి మనుగడ కష్టంగా మారుతోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు, ఆ పార్టీ అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. రాజమహేంద్రవరం శ్యామలా సెంటర్‌లోని డీసీసీబీ కార్యాలయం వద్ద సహకార ఉద్యోగులు మూడో రోజు శనివారం చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొని సహకార ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఆమె మాట్లాడుతూ సహకార ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకూ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చంద్రబాబు సర్కార్ జీవో నంబర్ 36ను అమలు చేసే వరకు సహకార ఉద్యోగుల పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కాంగ్రెస్ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు జేటీ రామారావు సహకార ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రామయ్య, ఏఐబీఈఏ మాజీ నాయకులు తోట రామారావు, జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, కోశాధికారి సుధాకర్‌వర్మ, ఉపాధ్యక్షుడు వీరభద్రం, వెంకటేశ్వరరావు, సీహెచ్ సూర్యచంద్రశేఖర్, ఎస్.అప్పారావు, డివిజన్‌లోని సహకార ఉద్యోగులు పాల్గొన్నారు.

# విలేకరిపై విరుచుకుపడిన ఎమ్మెల్యే మద్దిపాటి



**రాజమహేంద్రవరం:** పైకి పొత్తులు.. లోపల కత్తులు మాదిరిగా టీడీపీ, జనసేన నాయకుల తీరు ఉందనే విషయం అందరికీ తెలిసిందే. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే వారి మధ్య విభేదాలు మొదలయ్యాయి. ఆ వివాదాలను వారిలో వారు రహస్యంగా పరిష్కరించుకుంటే ఏ సమస్యా ఉండదు. కానీ బహిరంగంగా గొడవలు పడడం, వాటిని వెలుగులోకి తెచ్చే విలేకరిపై విరుచుకుపడడం దారుణం. సాక్షాత్తూ ఒక ఎమ్మెల్యే ఇలా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. రాజమహేంద్రవరంలోని రివర్ బే హోటల్లో మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి శనివారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. అనంతరం మంత్రి దుర్గేష్ స్టేజ్ దిగి వెళుతుండగా జనసేన నేతలు అడ్డుకున్నారు. గోపాలపురం నియోజకవర్గంలో జనసేన నేతలకు టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, సమావేశాలకు ఆహ్వానించడం లేదని తెలిపారు. దీంతో దుర్గేష్, ఎమ్మెల్యేలు సదరు జనసేన నేతలతో మంతనాలు జరిపారు. ఎన్నో రోజుల నుంచి సమస్య ఉన్నా.. పరిష్కరించడం లేదని జనసేన నేతలు పెద్దగా అరవడం మొదలు పెట్టారు. దీంతో పక్కనున్న జర్నలిస్టులు అక్కడికి చేరుకున్నారు. కూటమి నేతలు, మంత్రి, ఎమ్మెల్యే మధ్య జరుగుతున్న వాగ్వాదాన్ని ఓ దినపత్రిక విలేకరి ఫొటో తీస్తుండగా.. గమనించిన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఒక్కసారిగా ఆ విలేకరిపై విరుచుకుపడ్డారు. ' ఏయ్ ఎవరు నువ్వు.. ఏం తీసుస్తున్నావ్.. ఏంటి నీ కథ' అంటూ రెచ్చిపోయారు. ఒకానొక దశలో దాడి చేసే పరిస్థితికి వచ్చారు. చేయి చూపించి మరీ బెదిరింపులకు దిగారు. పక్కనే ఉన్న ఎమ్మెల్యే అనుచరుడు ఆ విలేకరి ఫోన్ లాక్కున్నాడు. తీసిన ఫొటోలను డిలిట్ చేసేందుకు సిద్ధమయ్యాడు. దీంతో మిగిలిన విలేకరులందరూ ఒక్కసారిగా అక్కడికి చేరుకుని ఫోన్ లాక్కున్న కార్యకర్త వద్ద ఫోన్ తీసుకున్నారు. ఫోన్ ఎందుకు తీసుకున్నావంటూ ప్రశ్నించారు. దీంతో పక్కనే ఉన్న మంత్రి దుర్గేష్ కలగజేసుకుని విలేకరులకు సద్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది. దీంతో ఎమ్మెల్యే మద్దిపాటి అక్కడి నుంచి జారుకున్నారు.

# అన్నవరప్పాడుకు పోటెత్తిన భక్తులు



**పెరవలి:** అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి రద్దీ నెలకొంది. స్వామి, అమ్మవార్లను అర్చకులు వివిధ రకాల పువ్వులతో సుందరంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాల పంపిణీతో పాటు 10 గంటల నుంచి అన్నసమారాధన జరిపారు. మండలంలోని కడింపాడు గ్రామానికి చెందిన వేంద్ర పెద్ద శక్తిరాజు, కొండారత్నం దంపతుల కుమారులు కలసి అన్నదానం నిర్వహించారు. సుమారు 14 వేల మంది భక్తులు స్వామి ప్రసాదాలను స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

# గోదావరి పుష్కరాలకు

## ముందస్తు సన్నాహాలు

**సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం):** 2027లో జరిగే గోదావరి మహా పుష్కరాలకు జిల్లా స్థాయిలో సమగ్ర సన్నాహక చర్యలు ప్రారంభమయ్యాయని కలెక్టర్ కీర్తి అన్నారు. ఆమె శనివారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనికి ఎస్పీ డి.నరసింహ కిశోర్, జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పార్కింగ్ స్థలాలు, పుష్కర నగర్‌ల కోసం అవసరమైన ల్యాండ్ గుర్తింపుపై ఏడు రోజుల్లోగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ రూపంలో కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలన్నారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాలకు తగిన పార్కింగ్ స్థలాలను గుర్తించడంతో పాటు, గుర్తించిన ప్రదేశాల్లో ఎన్ని బస్సులు నిలిపి ఉంచవచ్చో కచ్చితంగా లెక్కించాలన్నారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు.

# ఆదర్శ పాఠశాలలు పిలుస్తున్నాయ్

**అనకాపల్లి, విశాఖసమాచారం:** చీడికాడ, నెహ్రూచౌక్ (అనకాపల్లి), : ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 23 నుంచి మార్చి 31 వరకు అర్హులైన వారంతా సమీపంలోని ఆదర్శ పాఠశాలలకు దరఖాస్తు చేయవచ్చు. బాలబాలికలకు ఆంగ్లంలో ఉచిత బోధన అందిస్తారు. రాత పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

జిల్లాలో మంచాల (చీడికాడ), మరుపాక (రావికమతం), వేములపూడి (నర్సీపట్నం), తేగాడ (కశింకోట), పాటిపల్లి (మునగపాక)లో ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఆరో తరగతిలో ప్రవేశానికి ఒక్కో పాఠశాలలో వంద చొప్పున 500 సీట్లు ఉన్నాయి. ఆరో తరగతిలో చేరితే ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు.

ఓసీ, బీసీ విద్యార్థులు 2014 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31లోపు జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31లోపు జన్మించిన వారై ఉండాలి. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లో చదివి ఉత్తీర్ణత సాధించాలి.

**దరఖాస్తు ఇలా..:** మార్చి 31 వరకు www.csc.ap.gov.in వెబ్‌సైటులో దరఖాస్తు చేయవచ్చు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.125 పరీక్ష రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఫీజు చెల్లించగానే ఓ ప్రత్యేక నంబరు కేటాయిస్తారు. ఆ నంబరు ఆధారంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ 12న తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా ఆదర్శ పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయి. ఐదో తరగతి స్థాయిలో ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నపత్రం ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థులు కనీసం 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30 మార్కులు పొంది ఉండాలి. ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని మంచాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి చెప్పారు.

# వైయస్సార్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా డోల బాబ్జి



**సాలూరు విశాఖ సమాచారం :** వైయస్సార్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా పాచిపెంట మండలానికి చెందిన సీనియర్ నాయకుడు డోల బాబ్జి నియమించారు వైయస్సార్ పార్టీ మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర. ఒక ప్రకటనలో తెలిపారు బాబ్జి యుక్త వయస్సులో అంబేద్కర్ యువజన సంఘాలు స్థాపించి సంఘ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ యువకులలో క్రీడా రంగాన్ని ప్రోత్సహించడానికి మండల స్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలిచాడు 2000 సంవత్సరం తన తల్లిని పాచిపెంట సర్పంచిగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయించి సర్పంచిగా తల్లి అప్పయ్యమ్మ సర్పంచిగా గెలుపొందారు మొదటిలో ఉత్తరాంధ్ర టైగర్ ఎస్ విజయరామరాజు శిష్యుడుగా చేరి రాజకీయ రంగప్రవేశం చేశారు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కార్యకర్త నుండి జిల్లా రాష్ట్ర నాయకుడిగా ఎదిగాడు మాజీ ఎమ్మెల్యే రాజన్న దొర కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో పాచిపెంట నుండి అత్యధిక మెజార్టీ తెప్పించారు పార్టీకి అంకితభావముతో పనిచేసి బొత్స సత్యనారాయణ ప్రస్తుత ఎమ్మెల్సీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు సహాయ సహకారంతో పార్టీ అభివృద్ధికి కీలక పాత్ర పోషించాడు రిజర్వేషన్లు మారిన పార్టీ నాయకులను ఎన్నికల్లో పోటీ బరిలో దింపి ఎంపీపీ జడ్పిటిసి ఎంపీటీసీలు పార్టీ బీఫారాలు ఇచ్చిన అభ్యర్థులను గెలిపించడానికి కృషిచేసి విజయం సాధించారు తెలుగుదేశం పార్టీ ఎంపీపీగా పిన్నింటి ఈశ్వరరావు పై అవిశ్వాస తీర్మానం పెట్టి కాంగ్రెస్ పార్టీ నుండి కిర్ల కోటేశ్వరరావును ఎంపీపీగా చేయడం జరిగింది రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి బాబ్జి రాజకీయ సేవలను గుర్తించి వైయస్సార్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా ఆదేశాలు ఇచ్చారని రాజన్న దొర తెలిపారు బాబ్జి చిన్ననాటి స్నేహితులు మరియు వైయస్సార్ పార్టీ కార్యకర్తలు నాయకులు అభినందనలు తెలిపారు

# ఘనంగా ఎర్రన్నాయుడు జయంతి వేడుకలు..



తెలుగువారి గొంతును దేశరాజధానిలో వినిపించిన నేత ఎర్రన్నాయుడు టిడిపి నేతలు దాసరి శేషు, రాజనా పండు చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెంలో మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 69వ జయంతి వేడుకలు వెలమ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజనా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానిక్ టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డా. దాసరి శ్యామ్ చంద్ర శేషుతో కలిసి రాజనా పండు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దాసరి శేషు, రాజనా పండులు మాట్లాడుతూ మారుమూల శ్రీకాకుళం జిల్లాలో పుట్టి తెలుగుదేశం పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి ఢిల్లీ స్థాయిలో తెలుగువారి గొంతు వినిపించిన నాయకుడు ఎర్రన్నాయుడు అని అన్నారు. తెలుగువారికి అండగా ఢిల్లీలో తనదైన శైలిలో పనిచేశారని, కేంద్రమంత్రిగా అనేక విప్లవాత్మకమైన కార్యక్రమాలు చేపట్టారని, దేశం తరపున ఐక్యరాజ్య సమితిలో మాట్లాడిన తెలుగు వ్యక్తి ఎర్రన్నాయుడు అని కొనియాడారు. నేడు ఆయన రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆయన కుమారుడు దేశంలోనే అత్యంత పిన్న వయసు కలిగిన మంత్రిగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు అన్నారు. ఆయన సోదరుడు రాష్ట్ర క్యాబినెట్లో వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేస్తుంన్నారని, ఒకే కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు రాష్ట్ర, కేంద్ర మంత్రులుగా ఒకేసారి పనిచేయడం రాష్ట్ర చరిత్రలో అరుదైన ఘట్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, పంబి సత్యనారాయణ, నౌడు దుర్గారావు, చింతకాయల అచ్చిరాజు, పేట్ల సుబ్బు, వీరమల్ల పోసిబాబు

# ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీకి 10 రోజుల్లో పరిష్కారం

## పండురూ గ్రామ ప్రజల సొంతింటి కల సాకారం



**కాకినాడ రూరల్ విశాఖ సమాచారమ్**: గత ప్రభుత్వ కాలంలో మంజూరైన ఇళ్ల పట్టాలు అమలులోకి రాక కేవలం కాగితాలకే పరిమితమవడంతో కాకినాడ రూరల్ మండలం పండురూ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. సొంత ఇంటి కల నెరవేరుతుందా అనే సందిగ్ధంలో ఉన్న గ్రామస్తులు ఇటీవల నిర్వహించిన ప్రజా దర్బార్‌లో తమ సమస్యను వివరించారు. రూరల్ టీడీపీ కో కోఆర్డినేటర్ కటకం శెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ ప్రజలు తమ వినతిపత్రాన్ని సమర్పించారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేకంగా పరిశీలింపజేయడంతో ప్రజా దర్బార్‌లో అర్జీ ఇచ్చిన పది రోజుల్లోనే లబ్ధిదారులకు గృహ స్థలాల కేటాయింపు పూర్తయిందని గ్రామస్తులు తెలిపారు. తమ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సొంతింటి కలను నిజం చేసిన ప్రభుత్వానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేసిన నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తమకు న్యాయం జరిగే వరకు వెన్నంటి నిలిచిన కటకం శెట్టి వెంకట ప్రభాకర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతాభివందనలు తెలిపారు.

# వినియోగదారుల పరిరక్షణ చట్టం 2019 పై విద్యార్థులకు అవగాహన సదస్సు



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** గోపాలపట్నం రైతుబజార్ విశాఖపట్నం నందు రైతులకు వినియోగదారుల చట్టాలతో పాటు ఉచిత న్యాయ సేవధికారి సంస్థ విడుదల చేసిన బాల్య వివాహాలపై మరియు సే నోటు డ్రగ్స్ పై గ్రామీణ గిరిజన ప్రాంతాల నుండి వస్తున్న రైతులకు జిల్లా వినియోగదారుల సంఘాల సమైక్య చైర్మన్ మర్రి సత్యనారాయణ ప్రతి ఒక్కరు చట్టాలు తెలుసుకొని రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని తల్లిదండ్రులు పిల్లల పట్ల వారి దినదిన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని పిల్లలు చెడు మార్గంలో పయనించ కుండా జాగ్రత్తలు పడాలని బాల్య వివాహాలు అరికట్టాలని 18 సంవత్సరాలు ఆడపిల్లలకు మగ పిల్లవాడికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత పెళ్లిళ్లు చేయాలని పిల్లలు మత్తు పదార్థాలకు బానిస కాకుండా హెచ్చరించాలని ప్రతి సమస్యకు పరిష్కారం కొరకు ఉచిత న్యాయస్థానం కి 15100 ద్వారా ఫోన్ చేసి సలహాలు మరియు ఫిర్యాదులు చేయవచ్చని తెలియజేశారు గోపాలపట్నం రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ శ్రీ ప్రసాద్ గారు రైతులకు చట్టాలపై అవగాహన పరిచినందుకు పెందుర్తి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు దేవుని బాబుని మర్రి సత్యనారాయణ గారిని అభినందించడం జరిగింది

# శ్రీ సత్యనారాయణ స్వామి కొండ వద్ద చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘ ఆత్మీయ వనసమారాధనకు ఆహ్వానం..

**విశాఖపట్నం, విశాఖసమాచారం: :** మార్చి 1 వ తేదీ, ఆదివారం అనకాపల్లి పట్టణ శ్రీ చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యములో శ్రీ సత్యనారాయణ స్వామి కొండ వద్ద తేదీ.01.03.2026, ఆదివారం ఉదయం ..9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు దేవాంగ కుటుంబ సభ్యులతో కలసి ఆత్మీయ, ఆనందములతో జరుపుకునే ఆత్మీయ వన సమారాధకు దేవాంగ కుటుంబ సభ్యులందరు విచ్చేసి విజయవంతం చేయాలని దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు రెడ్డి వరప్రసాద్ , కార్యదర్శి బూడిద నాగేశ్వరావు , సంఘ ప్రచార కమిటీ సభ్యులు బల్లా నాగభూషణం లు ఈ దినం పత్రికా ప్రకటనలో తెలియ జేశారు.ఈ ఆత్మీయ వన సమారాధనకు ముఖ్య అతిథులుగా ప్రముఖ చలనచిత్ర దర్శకుడు, అనకాపల్లి వాస్తవ్యులు శ్రీ నక్కిన త్రినాథరావు, సి.ఎమ్.ఆర్.షాపింగ్ మాల్ అధినేత శ్రీ మావూరి వెంకటరమణ గార్లు పాల్గొంటారని, ఈ వన సమారాధన లో ఆటలపోటీలు, ఆర్కెస్ట్రా, మ్యాజిక్ షో, డోనాల్డ్ డక్ , లక్కీ డిప్ తదితర కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అలాగే దేవాంగ కుటుంబ సభ్యులలో వివాహం అయి 50 స..ము..లు..పూర్తి చేసుకున్న దంపతులకు ఘన సన్మానం, అలాగే 2024, 2025 స..ము..లలో ఉన్నత కోర్సులు, ( ఎన్.ఐ.టి, ఐ.ఐ.టి. మరియు ఎమ్.బి.బి.ఎస్) చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు అభినందన సత్కారం చేయడం జరుగుతుందని దేవాంగ సంక్షేమ సంఘం ప్రచార కమిటీ సభ్యులు , సిద్దార్థ సోషల్ సర్వీస్& కల్చరల్ అసోసియేషన్, అధ్యక్షులు బల్లానాగభూష ణము ఈ సందర్భముగా తెలియ జేశారు.గావున దేవాంగ కుటుంబ సభ్యులు అందరూ ఈ కార్యక్రమానికి సహకరించి, ప్రోత్సాహాన్ని అందించి దేవాంగ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బల్లానాగభూషణము విజ్ఞప్తి చేసారు.

# రెవెన్యూ దూకుడు



ఆస్తిపన్ను బకాయిదారులకు జప్తు నోటీసులు

**సిరిపురం, విశాఖసమాచారం:** ఆస్తిపన్ను బకాయిలపై జీవీఎంసీ రెవెన్యూ అధికారులు దూకుడు పెంచారు. పన్ను బకాయిలు (అరియర్స్) చెల్లించాలని హెచ్చరిస్తూ జారీ చేసిన జప్తునోటీసులకు స్పందించినవారి ఆస్తులకు తాళం వేసి, సీజ్ చేస్తున్నారు. దీంతో బకాయిదారులకు మరోమార్గం లేక చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో గత 12 రోజుల్లో రూ.85 కోట్లు ఆస్తిపన్ను వసూలుకాగా అందులో రూ.32 కోట్లు కేవలం అరియర్స్ కావడం రెవెన్యూ యంత్రాంగం దూకుడుకు అద్దంపడుతోంది.

జీవీఎంసీ పరిధిలో 6,02,937 ఆస్తిపన్ను అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. వీటిద్వారా ప్రతి ఏటా సుమారు రూ.435 కోట్ల ఆస్తిపన్ను వసూలవుతుంది. కాగా యజమానులు సకాలంలో పన్ను చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. చెల్లించాలంటూ రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఎన్నిసార్లు కోరినా స్పందించకపోవడంతో ప్రతి ఏటా పెరిగిపోతున్నాయి. ఇదిలా ఉండగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు ఆస్తులకు సంబంధించి రూ.134 కోట్లు బకాయిలు, రెగ్యులర్ పన్ను కింద రూ.436 కోట్లు మొత్తం రూ.570 కోట్లు వసూలుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో పన్నుల వసూలు ఆశించినస్థాయిలో లేకపోవడం అధికారులను కలవరపాటుకు గురిచేసింది. దీంతో కమిషనర్ కేతన్‌గార్గ్ కేవలం ఆస్తిపన్ను వసూళ్లను పెంచడంపైనే దృష్టి కేంద్రీకరించారు. రెవెన్యూ డీసీఆర్ శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్లతో ప్రతి వారం సమీక్ష నిర్వహించి పన్ను వసూళ్లపై టార్గెట్‌లు నిర్దేశించారు. గ్రేటర్ పరిధిలో సుమారు 1,36,149 మంది పన్ను బకాయిదారులు ఉన్నట్టు గుర్తించి వారందరికీ తక్షణం అరియర్స్ చెల్లించాలని, లేదంటే ఆస్తులను జప్తుచేస్తామని హెచ్చరిస్తూ నోటీసులు జారీచేశారు. అయినప్పటికీ ఎవరూ స్పందించలేదు. దీం తో వార్డుస్థాయిలో అడ్మిన్ సెక్రటరీ నుంచి ఆర్ఐలు, ఆర్ఓ లు, జెడ్సీలు, డిప్యూటీ కమిషనర్ వరకు అందరూ ఏడు గంటల నుంచి పన్ను బకాయిదారుల ఇళ్లకు, కార్యాలయాలకు వెళ్లి యజమానులతో చర్చించి వసూలుచేయడంపై పడ్డారు. ఒకవేళ ఎవరైనా పన్ను చెల్లించేందుకు సుముఖంగా లేరని అనిపిస్తే వారి ఆస్తులకు తాళం వేసి జప్తుచేయడం ప్రారంభించారు. ఇలా గత 15రోజుల్లో ఏకంగా 1,500కి పైగా ఆస్తులను జప్తుచేయడం అధికారుల దూకుడుకి అద్దంపడుతోంది. ఆస్తులను జప్తుచేసేస్తుండడంతో యజమానులు బకాయిలు చెల్లించేందుకు పరుగుతు పెడుతున్నారు.విశాఖపోర్టు ట్రస్టు రూ.11 కోట్లు ఆస్తిపన్ను చెల్లిస్తూ ఆదివారం డిప్యూటీ కమిషనర్‌కు చెక్కును అంద జేసింది. జగదాంబ కూడలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి రూ.14లక్షలు పన్ను బకాయి ఉండడంతో ఆ మొత్తాన్ని చెల్లించాలని అధికారులు ఆస్పత్రికి వెళ్లి ప్రతినిధులతో చర్చించి, వసూలుచేశారు.

ఆస్తిపన్ను వసూలవుతుంది. కాగా యజమానులు సకాలంలో పన్ను చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. చెల్లించాలంటూ రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఎన్నిసార్లు కోరినా స్పందించకపోవడంతో ప్రతి ఏటా పెరిగిపోతున్నాయి. ఇదిలా ఉండగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు ఆస్తులకు సంబంధించి రూ.134 కోట్లు బకాయిలు, రెగ్యులర్ పన్ను కింద రూ.436 కోట్లు మొత్తం రూ.570 కోట్లు వసూలుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సిరిపురం సర్కిల్‌లోని అశోక్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఆస్తికి సంబంధించి రూ.25.87 లక్షలు బకాయి ఉండడంతో అధికారులు శనివారం సీజ్‌చేశారు. ఈనెల తొమ్మిదో తేదీనాటికి రూ.134.24 కోట్ల బకాయిలుండగా కేవలం రూ.49.52 కోట్లు వసూలయింది. ఈనెల 21నాటికి రూ.82 కోట్లు అరియర్స్ వసూలయింది.21 నాటికి రూ.452 కోట్టుకు చేరింది. అంటే గత 12రోజుల్లో అరియర్స్ ద్వారా రూ.32కోట్లు, రెగ్యులర్ ఆస్తిపన్ను ద్వారా రూ.53 కోట్లు మొత్తం రూ.85 కోట్లు వసూలవడం అధికారులను ఆనందానికి గురిచేస్తోంది. వచ్చేనెల 31 వరకు ఇదే దూకుడు ప్రదర్శిస్తే డిమాండ్ మేరకు ఆస్తిపన్ను, అరియర్స్ వసూలు సాధ్యమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఆరోగ్యశాఖలో ఫేక్ నియామక ఉత్తర్వుల హల్‌చల్



**విశాఖపట్నం, విశాఖసమాచారం:** వైద్య, ఆరోగ్యశాఖలో నకిలీ నియామక ఉత్తర్వులు హల్‌చల్ చేస్తున్నాయి. పోస్టుల భర్తీ లేకుండానే కొంతమందిని నమ్మించి రూ.లక్షలు దోచేసి, పూర్వ అధికారుల పేరుతో దర్జాగా ఉత్తర్వులు ఇచ్చేస్తున్నారు. ఉద్యోగం వచ్చిందనే ఆనందంలో వాటిని తీసుకుని ఆయా కార్యాలయాలకు వెళ్లిన అభ్యర్థులు అవి ఫేక్ అని తెలియడంతో మోసపోయామని గుర్తించి, డీఎంహెచ్‌వో కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఇలాంటి అక్రమాలు వెలుగుచూసిన సందర్భంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అధికారులు ఆ తరువాత పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

అమాయక అభ్యర్థులకు ఫేక్ ఉత్తర్వులు జారీచేసిన ఉదంతాలు గతంలో అనేకం వెలుగులోకి వచ్చాయి. వీటిపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన ఆరోగ్యశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. ఏజెన్సీలోని ఆరోగ్య కేంద్రం క్రిటికల్ కేర్ విభాగంలో స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఇద్దరికి నియామక ఉత్తర్వులు అందాయి. దీంతో ఆస్పత్రికి వెళ్లిన అభ్యర్థులకు దిమ్మతిరిగే షాక్ తగిలింది. నియామక ఉత్తర్వులు పరిశీలించిన అక్కడి అధికారులు ఈ తరహా పోస్టులు లేవని, ఉత్తర్వుల్లో సంతకం ఉన్న ఆరోగ్యశాఖ అధికారి ప్రస్తుతం ఇక్కడ లేరని చెప్పడంతో వారు కంగుతిన్నారు. వెంటనే విశాఖ ఆరోగ్యశాఖ కార్యాలయానికి వచ్చి తమకు జరిగిన మోసాన్ని చెప్పి లబోదిబోమన్నారు. దీనిపై అప్పట్లో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది జరిగిన కొద్ది నెలలకే మరో కేసు వెలుగులోకి వచ్చింది. అనకాపల్లి జిల్లాలోని ఓ ఆరోగ్య కేంద్రంలో రెండు కేటగిరీలకు చెందిన ఉద్యోగాల పేరుతో ఇద్దరికి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఆస్పత్రికి వెళ్లిన వారికి ఇదే తరహా అనుభవం ఎదురయింది. నియామక ఉత్తర్వులు ఫేక్ అని, ఖాళీలను భర్తీచేసేందుకు నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని చెప్పడంతో వారు ఆరోగ్యశాఖ కార్యాలయానికి వచ్చారు. దీంతో మళ్లీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు సందర్భాల్లో గతంలో పనిచేసిన ఆరోగ్య శాఖ అధికారుల పేర్లతోనే ఉత్తర్వులు ఇచ్చారు. ఆ తరువాత కొద్ది నెలలకు కేజీహెచ్‌లోనూ ఉద్యోగాలు కల్పించినట్టు ఇద్దరికి నకిలీ నియామక ఉత్తర్వులను అందించారు. విధుల్లో చేరేందుకు వెళ్లిన వారిని సిబ్బంది వాకబు చేయగా మోసపోయినట్టు గుర్తించారు. వెంటనే ఆరోగ్యశాఖ అధికారుల వద్దకు పంపించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరికి ఇచ్చిన నియామక ఉత్తర్వుల్లో ప్రస్తుత డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు పేరు ఉంది. కానీ మరికొన్ని సంతకాల్లో తప్పిదాలున్నాయి. కేజీహెచ్ డీఎంఈ కంట్రోల్ ఆస్పత్రి. ఇక్కడ జరిగే నియామకాలకు ఆరోగ్యశాఖ అధికా రితో సంబంధం ఉండదు. కానీ మోసగాళ్లు ఇవేమీ పట్టించుకోకుండా ఉత్తర్వులు తయారుచేసి ఇచ్చేస్తున్నారు. వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు**

ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల పేర్లతో నకిలీ నియామక ఉత్తర్వులు వెలుగులోకి వస్తున్నప్పటికీ అధికారులు పట్టనట్టు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సదరు అభ్యర్థులు వచ్చినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేయడం, ఆ తరువాత విస్మరించడంతో మోసగాళ్లు రెచ్చిపోతూనే ఉన్నారు. పోస్టుల భర్తీ చేపట్టిన ప్రతిసారీ మోసగాళ్లు చెలరేగిపోతున్నారు. అడ్డగోలు వ్యవహారాలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసి మోసగాళ్లకు శిక్ష పడేలా చేయడంతోపాటు బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇలా మోసపోయిన కొందరు ఇప్పటికీ ఆరోగ్యశాఖ అధికారులు చుట్టూ తిరుగుతున్నారు.

**ఫార్మాసిస్టు పోస్టుల భర్తీకి కసరత్తు**

వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న 12 ఫార్మాసిస్టు పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పోస్టులకు జోన్-1 పరిధిలో 583 మందికి దరఖాస్తు చేయగా, వాటిని ప్రస్తుతం పరిశీలిస్తున్నారు. ఈ నెలాఖరుకు ప్రొవిజనల్ మెరిట్ జాబితా సిద్ధమవుతుందని,ఆ తరువాత అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితాను విడుదలచేస్తామని అధికారులు తెలిపారు. దీనిపై ఆర్డీ డాక్టర్ రాధారాణి మాట్లాడుతూ నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, దళారులను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు.

# అనుమానం.. ఆపై వేధింపులు గృహిణి బలవన్మరణం

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** బొబ్బిలి, అనుమానం పెంచుకున్న భర్త తాగివచ్చి వేధిస్తుండడంతో జీవితంపై విరక్తి చెందిన గృహిణి ఉరివేసుకుని, ఆత్మహత్య చేసుకున్న ఘటన బొబ్బిలి పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కుమ్మరివీధికి చెందిన సుంకరి మాధవీదేవికి (40) బాడంగి మండలం చిన్న భీమవరానికి చెందిన



మర్రి నరేష్‌తో 16 ఏళ్ల కిందట ప్రేమ వివాహం అయ్యింది. భర్త కారు చోదకుడిగా, ఆమె ఓ ప్రైవేటు పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమారుడు పదో తరగతి, కుమార్తె తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఆమె పనిచేస్తున్న పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఫోన్ చేస్తున్న కారణంగా భర్త అనుమానం పెంచుకున్నాడు. తాగి వచ్చి తరచూ ఘర్షణకు దిగేవాడు. శనివారం రాత్రి మాధవీదేవి పిల్లలతో కలిసి సమీపంలో ఉంటున్న కన్నవారి ఇంటివద్ద భోజనం చేసి, కాసేపు నిద్రించారు. భర్త నరేష్ ఫోన్ చేయడంతో రాత్రి 9.30 సమయంలో ఇంటికి వెళ్లింది. మాధవీదేవికి వరుసకు తమ్ముడైన కిశోర్‌కు ఆదివారం ఉదయం నరేష్ ఫోన్‌చేసి, మీ అక్క చనిపోయిందని చెప్పడంతో వారంతా చేరుకున్నారు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అల్లుడు తరచూ వేధించడంతోనే తమ కుమార్తె ప్రాణాలు తీసుకుందని మృతురాలి తండ్రి వెంకటరమణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఆదివారం రాజాం యాత్రకు వెళ్దామని తల్లిదండ్రులతో మాట్లాడిన కొద్దిగంటల్లోనే ఈ అఘాయిత్యానికి పాల్పడడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# క్రీడా సినిమా సమాచారమ్

## గ్రాండ్‌గా అల్లు అర్జున్ పార్టీ.. ఉపాసన, రామ్ చరణ్‌తో పాటు సెలబ్రిటీలు



అల్లు కుటుంబంలో పెళ్లి వేడుక మొదలైంది. మార్చి 6న నయనికతో అల్లు శిరీష్ వివాహం కానుంది. ఈ నేపథ్యంలో ఇటీవలే దుబాయ్‌లో తమ సన్నిహితులతో ఓ పార్టీ కూడా చేసుకుని వచ్చారు. తాజాగా అల్లు అర్జున్ తమకు బాగా కావాల్సిన వారితో పాటు కుటుంబ సభ్యులకు రాత్రి స్పెషల్‌గా పార్టీ ఇచ్చారు. తమ్ముడు అల్లు శిరీష్ పెళ్లి సందర్భంగా అన్న అల్లు అర్జున్ ఇలా గ్రాండ్‌గా పార్టీ ఇస్తుంటే ఫ్యాన్స్ కూడా వారి బంధం గురించి పోస్టులు పెడుతున్నారు.

అయితే, తాజాగా జరిగిన పార్టీలో పాల్గొన్న వారి లిస్ట్ కూడా నెట్టింట వైరల్ అవుతుంది. గ్రాండ్‌గా జరిగిన పార్టీలో రామ్ చరణ్, ఉపాసన, సుస్మిత కొణిదెల, నిహారిక స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఆపై తేజా సజ్జా, వైష్ణవ్ తేజ్, సిద్ధు జొన్నలగడ్డ, సుశాంత్, కృతి శెట్టి, నేహా శెట్టి, రాశీ ఖన్నా, నభా నటేష్ పాల్గొన్నారని సమాచారం. అల్లు శిరీష్ – నయనికల పెళ్లి పిలుపుల్ని ఇప్పటికే వారు మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే తమ ఇంటి ఆడబిడ్డ సురేఖకు తొలి శుభలేఖను ఇచ్చారు. ఆ సమయంలో తన మావయ్య చిరంజీవికి అందించిన శిరీష్ ఆశీర్వాదం తీసుకున్నారు. అల్లు అరవింద్ సతీసమేతంగా చిరు దంపతులకు నూతన వస్త్రాలు అందించి పెళ్లికి ఆహ్వానించిన విషయం తెలిసిందే.

## ఎమోషన్.. నేను షారూఖ్ ఖాన్ అయ్యాను అంటే..!



బాలీవుడ్ లెజెండరీ రైటర్ సలీం ఖాన్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై ఉన్న ఈ సమయంలో బాలీవుడ్ ఉద్వేగంతో కదిలిపోతున్న సంగతి తెలిసిందే. సలీంఖాన్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్న క్రమంలో కుమారులు సల్మాన్ ఖాన్ ఆయన సోదరులను కలిసేందుకు పలువురు ఆస్పత్రికి విచ్చేస్తున్నారు. ముఖ్యంగా సల్మాన్ కి కష్టం వచ్చిన ఈ సమయంలో అతడి క్లోజ్ ఫ్రెండ్ షారూఖ్ ఖాన్ అండగా నిలిచారు. ఇదే సమయంలో షారూఖ్ ఖాన్ గతంలో సలీంఖాన్ గురించి చెప్పిన కృతజ్ఞతాపూర్వక మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. షారూఖ్ ఖాన్ తన కెరీర్ ప్రారంభ రోజుల్లో పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ సలీం ఖాన్ కుటుంబంపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ఢిల్లీ నుంచి ముంబైకి వచ్చి నటుడిగా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు షారూఖ్ ఖాన్‌కు సల్మాన్ ఖాన్ ఇంట్లోనే భోజనం దొరికేదని నాటి రోజులను గుర్తు చేసుకున్నారు. నేను ఈరోజు ఇలా ఉన్నానంటే.. నేను ఈ రోజు షారూఖ్ ఖాన్ అయ్యాను అంటే.. దానికి కారణం సలీం ఖాన్ గారే. వారు ఆ రోజుల్లో నాకు అందించిన మద్దతు.. పెట్టిన అన్నం వల్లే నేను ఈ స్థాయికి చేరుకున్నాను! అని షారూఖ్ ఒక ఇంటర్వ్యూలో (2018 -దస్ కా దమ్- షో సమయంలో) ఉద్వేగంగా చెప్పారు. సలీం ఖాన్ ఆరోగ్యంపై తాజా రిపోర్ట్ ఏమిటి? సలీంఖాన్ వయసు సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన వయసు 90 ఏళ్లు. ఫిబ్రవరి 17న మెదడులో స్వల్ప రక్తస్రావం కారణంగా ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ఆయనకు డిఎస్‌ఏ (డిజిటల్ సబ్‌ట్రాక్షన్ యాంజియోగ్రఫీ) అనే ప్రక్రియను పూర్తి చేశారు. ఎటువంటి మేజర్ సర్జరీ అవసరం లేదని.. ప్రస్తుతం ఆయన పరిస్థితి స్థిరంగా ఉందని డాక్టర్ జలీల్ పార్కర్ తెలిపారు. వయసు దృష్ట్యా రికవరీకి కొంచెం సమయం పట్టవచ్చని వైద్యులు పేర్కొన్నారు. సలీంఖాన్ వయసు సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన వయసు 90 ఏళ్లు. ఫిబ్రవరి 17న మెదడులో స్వల్ప రక్తస్రావం కారణంగా ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ఆయనకు డిఎస్‌ఏ (డిజిటల్ సబ్‌ట్రాక్షన్ యాంజియోగ్రఫీ) అనే ప్రక్రియను పూర్తి చేశారు. ఎటువంటి మేజర్ సర్జరీ అవసరం లేదని.. ప్రస్తుతం ఆయన పరిస్థితి స్థిరంగా ఉందని డాక్టర్ జలీల్ పార్కర్ తెలిపారు. వయసు దృష్ట్యా రికవరీకి కొంచెం సమయం పట్టవచ్చని వైద్యులు పేర్కొన్నారు. తన తండ్రి సలీం ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వర్గాలు లేదా వైద్యులు నేరుగా మీడియాకు అప్‌డేట్స్ ఇవ్వడంపై సల్మాన్ ఖాన్, ఆయన కుటుంబం అసహనం వ్యక్తం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఆరోగ్యం అనేది వ్యక్తిగత విషయమని.. కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా మెడికల్ బులెటిన్లు విడుదల చేయవద్దని వారు కోరారు. మీడియాలో రకరకాల ఊహాగానాలు రాకుండా ఉండాలంటే.. అప్‌డేట్స్ ఏవైనా ఉంటే కుటుంబమే నేరుగా చెబుతుందని ఆస్పత్రి యాజమాన్యానికి స్పష్టం చేశారు. సలీం ఖాన్ త్వరగా కోలుకోవాలని అమితాబ్ బచ్చన్, సంజయ్ దత్, అమీర్ ఖాన్ వంటి తారలు కూడా ఆకాంక్షిస్తున్నారు.

## రెండో పెళ్లి వార్తలపై మండిపడ్డ మీనా



సెలబ్రిటీల జీవితాలు ఎప్పుడూ అందరి కళ్ల ముందే ఉంటాయి. కానీ బయటకు కనిపించే ఆ వెలుగుల వెనుక ఎంత బాధ దాగి ఉంటుందో చాలా మందికి తెలియదు. తాజాగా సీనియర్ నటి మీనా మనసును ముక్కలు చేసే ఆవేదనను వ్యక్తం చేశారు. రీసెంట్ గా మీనా రెండో పెళ్లికి సిద్ధమవుతున్నారని సోషల్ మీడియాలో ప్రచారం మొదలవడం, సోషల్ మీడియా వాడకం పెరగడంతో ఆ వార్తలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. దీంతో అభిమానులు, సన్నిహితులు కూడా ఫోన్ చేసి ఈ విషయమై మీనాను అడగడం మొదలుపెట్టారు. వీటన్నింటితో సహనం కోల్పోయిన మీనా ఈసారి కాస్త గట్టిగానే స్పందించారు.

తన భర్త విద్యాసాగర్ 2022లో ఊపిరితిత్తుల సమస్యలతో చనిపోయిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. ఆ బాధ నుంచి ఇంకా పూర్తిగా బయటపడలేదు. ప్రస్తుతం నా కూతురే నా ప్రపంచం. తన కోసమే స్ట్రాంగ్ గా నిలబడుతున్నాను అంటూ కన్నీటి పర్యంతమయ్యారు మీనా. భర్త మరణించిన కొన్ని రోజులకే తనపై పెళ్లి పుకార్లు రాయడం మొదలైందని, కానీ అప్పట్లో పట్టించుకోలేదని చెప్పారు. కానీ తన మౌనాన్ని బలహీనతగా తీసుకుంటే ఎలా? అని ఆమె ప్రశ్నించారు. తానొక సెలబ్రిటీనని, ఒక మహిళనని, భర్తను కోల్పోయి ఒంటరిగా జీవిస్తున్న స్త్రీని అని, అందుకే తనను ఈజీగా టార్గెట్ చేస్తున్నారా అంటూ ప్రశ్నిస్తూ మీనా మండిపడ్డారు. ఈ వార్తలను ఇప్పటికే పలుమార్లు ఖండించానని, అయినా మళ్లీ మళ్లీ అదే కథలు రాయడం ఎందుకో అర్థం కావడం లేదని అన్నారు. ఫ్రెండ్స్ ఫోన్ చేసి పెళ్లి గురించి అడగడం తన గుండెను మళ్లీ మళ్లీ గాయపరుస్తోందని, ఇలాంటి ఫేక్ వార్తలు తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను చాలా పాజిటివ్ పర్సన్ ను అని, ఇకమీదట ఇలాంటి వాటి గురించి తన టైమ్, ఎనర్జీ, ఆరోగ్యాన్ని నాశనం చేసుకోదలచుకోలేదని, కర్మ అనేది ఒకటి ఉంటుందని, అది ఎవరినీ వదిలిపెట్టదని ఆమె అన్నారు. గతంలో పుకార్లు చాలా అరుదుగా వచ్చేవని, ఇప్పుడు సోషల్ మీడియా వల్ల క్షణాల్లో ప్రపంచమంతా తెలిసిపోతుందని, దాని వల్ల ఒక అబద్ధం కూడా నిజంలా మారిపోతుందంటూ ఆమె వ్యాఖ్యానించారు. మీనా చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై హద్దులు దాటుతున్న సోషల్ మీడియా సంస్కృతి పై ఇప్పుడు మరోసారి పెద్ద చర్చ మొదలైంది. ఇప్పటికైనా మీనా విషయంలో ఈ రూమర్లు ఆగుతాయేమో చూడాలి.

## అభిషేక్ శర్మ ఎందుకు సరిగా ఆడలేకపోయాడంటే..: సునీల్



సూపర్ 8లో భాగంగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఘోర పరాజయాన్ని మూట గట్టుకున్న విషయం తెలిసిందే. తాను ఆడిన మూడు మ్యాచుల్లో డకౌట్లు అయిన అభిషేక్ శర్మ ఎట్టకేలకు ఈ మ్యాచ్ ద్వారా వరల్డ్‌కప్ 2026లో తన పరుగుల ఖాతా తెరిచాడు. అయితే అతడు కేవలం 15 పరుగులకే వెనుదిరిగి అభిమానులను మరోసారి తీవ్ర నిరాశకు గురిచేశాడు. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా బౌలర్లు తెలివైన బంతులు సంధించారని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డాడు. అలాగే వారు భారత బ్యాటర్ అభిషేక్ శర్మను కట్టుదిట్టం చేశారన్నాడు. 'నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తున్నప్పుడు మొదటి బంతికే ఔటైనా.. తర్వాత బంతినీ ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. కానీ.. మ్యాచ్‌లో పరిస్థితి వేరు. ఒత్తిడి మిమ్మల్ని స్తంభింపచేస్తుంది. పెద్ద షాట్లు కొట్టనీయకుండా చేతులను కట్టిపడేస్తుంది. అతడు (అభిషేక్ శర్మ) ఒత్తిడి వల్లే స్వేచ్ఛగా ఆడలేకపోయాడు. అలాగే దక్షిణాఫ్రికా బౌలర్లు చాలా తెలివిగా వ్యూహరచన చేశారు. వారికి తెలుసు.. అతడు రూమ్ చేసుకుని ఆఫ్ సైడ్ ఆడతాడని. రబాడ సిక్స్ ఇచ్చిన తర్వాత కూడా అవిశ్రాంతంగా అభిషేక్ శర్మ ప్యాడ్లనే టార్గెట్ చేస్తూ.. బౌలింగ్ చేశాడు' అని సునీల్ గావస్కర్ విశ్లేషించాడు.

అలాగే భారత బ్యాటర్ల షాట్ సెలక్షన్ సరిగా లేదని అతడు అన్నాడు. 'భారత బ్యాటర్ల షాట్ సెలక్షన్ పేలవంగా ఉంది. డేవిడ్ మిల్లర్, డెవాల్డ్ బ్రేవిస్‌ను చూడండి.. బ్యాట్ మీదకు బంతి రాకున్నా.. వారు పరిస్థితులకు తగ్గట్లు చక్కగా ఆడారు. చక్కగా పరుగులు చేశారు. ఈ విషయంలో భారత బ్యాటర్లు విఫలమయ్యారు' అని సునీల్ గావస్కర్.. కుండబద్దలు కొట్టినట్లుగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

ఈ మ్యాచ్‌లో తిలక్ వర్మ సైతం బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. కీలకమైన సమయంలో చేతులెత్తేశాడు. కేవలం ఒక్క పరుగు మాత్రమే చేసి పెవిలియన్‌కు చేరాడు. 'తిలక్ వర్మ బ్యాటింగ్ అప్రోచ్ నన్ను నిరాశకు గురి చేసింది. అతడు క్రీజులోకి వచ్చే సమయానికే ఒక వికెట్ పడిపోయింది. అవసరమైన రన్ రేట్ 9.5 ఉంది నిజమే. కానీ ఓవర్‌కు 15 పరుగులు చేయాల్సిన పరిస్థితే అప్పుడు లేదు కదా. అందుకే క్రీజులో కుదురుకోవడానికి కాస్త సమయం తీసుకోవాల్సి ఉండేది. ముఖ్యంగా అభిషేక్ శర్మ ఫామ్‌లో లేదు. అలాంటి సమయాల్లో బాధ్యతగా బ్యాటింగ్ చేయాలి. భాగస్వామ్యం నెలకొల్పడానికి ప్రయత్నించి ఉండాల్సింది' అని సునీల్ గావస్కర్.. తిలక్ వర్మకు సూచించాడు.

## పురుషుల హాకీ ప్రొ లీగ్ రెండో అంచె బరిలో భారత్



సొంతగడ్డపై జరిగిన పురుషుల ప్రొ లీగ్ తొలి అంచెలో భారత హాకీ జట్టుకు నిరాశ ఎదురైంది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ టీమిండియా ఓటమి పాలైంది. అర్జెంటీనా, బెల్జియం జట్లతో రెండుసార్లు చొప్పున ఆడిన భారత జట్టు ఒక్క మ్యాచ్‌లోనూ గెలుపు రుచి చూడలేదు. ఇప్పుడు రెండో అంచె మ్యాచ్‌లకు భారత బృందం సిద్ధమైంది. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌తో భారత్ ఆడుతుంది. ఆ తర్వాత ఆదివారం జరిగే రెండో మ్యాచ్‌్లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది. ఒక రోజు విశ్రాంతి తర్వాత 24న స్పెయిన్‌తో, 25న్ర ఆస్ట్రేలియాతో టీమిండియా ఆడుతుంది. భారత అంచె పోటీల్లో సారథ్యం వహించిన హర్మన్‌ప్రీత్ సింగ్ వ్యక్తిగత కారణాలరీత్యా రెండో అంచె మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ స్థానంలో హార్దిక్ సింగ్ భారత జట్టుకు నేతృత్వం వహిస్తాడు. టోక్యో ఒలింపిక్స్, పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతకాలు నెగ్గిన భారత జట్టులో హార్దిక్ సింగ్ కీలక సభ్యుడిగా వ్యవహరించాడు. 'స్వదేశంలో జరిగిన తొలి అంచె మ్యాచ్‌ల్లో పొరపాట్లు ఎక్కడ జరిగాయో సమీక్షించాం. గెలుపు బోణీ కొట్టాలనే లక్ష్యంతోన్రే ఆస్ట్రేలియాకు వచ్చాం' అని మిడ్‌ఫీల్డ్‌లో ఆడే హార్దిక్ సింగ్ వ్యాఖ్యానించాడు.

## పాక్ హాకీ కెప్టెన్ షకీల్‌పై నిషేధం ఎత్తివేత



పాకిస్తాన్ హాకీలో సంక్షోభం ముదురుతున్న వేళ ఆ దేశ సర్కారు జోక్యం చేసుకుంది. పాకిస్తాన్ హాకీ జట్టు కెప్టెన్ అమద్ షకీల్ భట్‌పై ఆ దేశ హాకీ సమాఖ్య (పీహెచ్‌ఎఫ్) విధించిన రెండేళ్ల నిషేధాన్ని పాక్ ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ నిషేధం నియమావళికి విరుద్ధమని ప్రభుత్వం ప్రకటించింద్రి. ఆస్ట్రేలియా పర్యటనలో పీహెచ్‌ఎఫ్ నిర్వహణ లోపంతో పాకిస్తాన్ హాకీ ఆటగాళ్లు వీధిన పడ్డారు. బసచేస్తున్న హోటల్‌కు నిధులు విడుదల చేయకపోవడంతో ఆటగాళ్లంతా రోడ్లపై పడిగాపులు కాశారు. దీంతో పీహెచ్‌ఎఫ్ నిర్వాకంపై కెప్టెన్ షకీల్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. దీన్ని సహించలేకపోయిన పీహెచ్‌ఎఫ్ అధ్యక్షుడు తారిఖ్ బగ్గీ క్రమశిక్షణ చర్యల కింద కెప్టెన్‌పై నిషేధం విధించారు. తర్వాత తన అధ్యక్ష పదవికి బగ్గీ రాజీనామా చేశారు. ఆసీస్‌లో పాక్ అప్రతిష్టపాలుపై గుర్రుగా ఉన్న పీహెచ్‌ఎఫ్ ప్యాట్రన్ ఇన్ చీఫ్, దేశ ప్రధాని షహబాజ్ షరీఫ్... బగ్గీ రాజీనామాను వెంటనే ఆమోదిస్తూ అహ్మద్ అధ్యక్షతన అడ్‌హక్ కమిటీని నియమించారు. అలాగే కెప్టెన్ షకీల్‌పై నిషేధం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని బగ్గీ విధించిన సస్పెన్షన్ నిర్ణయాన్ని తప్పుబట్టారు.

## ఆఫ్ఘన్ క్రికెట్ తలరాతను మార్చిన ధీరుడు




జోనాథన్ ట్రాట్.. ఈ పేరు ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ చరిత్రనే మార్చేసింది. ఈ మాజీ ఇంగ్లీష్ ఆటగాడు 2022లో ఆఫ్ఘనిస్తాన్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నో ఊహించని అద్భుతాలు చేశాడు. అప్పటివరకు పసికూనగా ఉన్న జట్టును లెజెండ్ కిల్లర్‌గా తీర్చిదిద్దాడు. ఆఫ్ఘన్‌తో పోటీ అంటే ఎంతటి జట్టైనా ఉలిక్కిపడే స్థాయికి తీసుకెళ్లాడు. ఆఫ్ఘనిస్తాన్ ఇకపై ఎంతమాత్రం చిన్న జట్టు కాదు.. ప్రపంచంలో ఏ జట్టునైనా ఓడించగలిగే సత్తా ఉన్న జట్టు అని అనుకునేలా చేశాడు.

ఆఫ్ఘన్ కోచ్‌గా ట్రాట్ పదవీకాలం పూర్తైన నేపథ్యంలో అతను సాధించిన విజయాలు, అతని హయాంలో ఆఫ్ఘన్ జట్టు సాధించిన పురోగతిపై ఓ లుక్కేద్దాం.

వాస్తవానికి ట్రాట్‌కు ఆఫ్ఘనిస్తాన్ కోచింగ్ బాధ్యతలు అనుకోకుండా దక్కాయి. ఆ స్థానాన్ని మరో ఇంగ్లండ్ బ్యాటర్ గ్రహం థోర్ప్ భర్తీ చేయాల్సి ఉండింది. అయితే థోర్ప్‌కు వేరే కమిట్‌మెంట్స్ ఉండటంతో ట్రాట్‌కు లక్కీగా ఈ ఛాన్స్ వచ్చింది. ఈ అఫర్‌ను ఒడిసిపట్టుకున్న ట్రాట్.. మొదటి రోజు నుంచే తన పని మొదలుపెట్టాడు.

ఆటగాళ్లకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, వారిలో స్ఫూర్తిని రగిల్చడం ప్రారంభించాడు. 2019 వరల్డ్‌కప్‌లో ఆఫ్గన్ జట్టు అన్ని మ్యాచ్‌లు ఓడిపోయి తీవ్ర నిరాశలో కూరుకొని ఉంది. ఆ సమయంలో ట్రాట్ వారికి ఆశాకిరణంలా మారాడు. ఆయన రాకతో జట్టులో క్రమశిక్షణ, వ్యూహాత్మక ఆలోచన, మానసిక దృఢత్వం పెరిగింది. ఆటగాళ్లు కలిసికట్టుగా ఆడటం మొదలుపెట్టారు. ట్రాట్ బాధ్యతలు చేపట్టాక తొలి సిరీస్‌లోనే ఆఫ్ఘనిస్తాన్‌కు పరాజయం ఎదురైంది. ఐర్లాండ్ చేతిలో ఆ జట్టు 2-3 తేడాతో టీ20 సిరీస్‌ను కోల్పోయింది. ట్రాట్ క్రమశిక్షణకు తొలి ఫలితం 2022 ఆసియా కప్‌లో వచ్చింది. ఆ టోర్నీలో ఆఫ్ఘన్ జట్టు శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లకు ఊహించని షాకిచ్చింది. ట్రాట్ మార్గదర్శకత్వంలో ఆఫ్ఘన్ జట్టు ఆ మురుసటి ఏడాది (2023) మరింత రాటుదేలింది. ఇంగ్లండ్‌పై చారిత్రక విజయం, పాకిస్తాన్‌పై టీ20 సిరీస్ గెలుపు, శ్రీలంకపై ఆధిపత్యం.. ఇవన్నీ ఒక్కొక్కటిగా సాధ్యమయ్యాయి. ఈ మధ్యలో చిన్న జట్లపై ఆధిపత్యం కూడా తారాస్థాయికి వెళ్లింది. 2024 టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాను ఓడించి సెమీఫైనల్ చేరిన క్షణం ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. పొట్టి ప్రపంచకప్ ఇచ్చిన స్ఫూర్తితో ఆఫ్ఘన్ జట్టు ఆతర్వాత సౌతాఫ్రికా లాంటి పటిష్టమైన జట్టును కూడా మట్టికరిపించింది.

ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లోనూ ఆఫ్ఘనిస్తాన్ జట్టు సంచలనాలు నమోదు చేస్తుందని అంతా ఊహించారు. అయితే దురదృష్టవశాత్తు సౌతాఫ్రికా, న్యూజిలాండ్ చేతుల్లో ఓడి సూపర్-8కు అర్హత సాధించలేకపోయింది. అయితే ఈ టోర్నీలో సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్ పొట్టి క్రికెట్ చరిత్రలోనే చిరస్మరణీయంగా మిగిలిపోతుంది. ఆ మ్యాచ్‌లో ఇరు జట్లు గెలుపు కోసం (రెండు సూపర్ ఓవర్లు) కొదమసింహాల్లా పోరాడాయి. అంతిమంగా సౌతాఫ్రికాదే పైచేయి అయినప్పటికీ.. ఆఫ్ఘన్ పోరాటం క్రికెట్ ఉనికిలో ఉన్నంతకాలం గుర్తుండిపోతుంది.

ఆఫ్ఘనిస్తాన్ తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో కెనడాపై ఘన విజయం సాధించి, గెలుపుతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచే ట్రాట్‌కు ఆఫ్ఘన్ కోచ్‌గా చివరి మ్యాచ్. మూడేళ్లపై పైగా పదవీకాలంలో ట్రాట్ అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఆఫ్ఘన్ ఆటగాడు భావోద్వేగానికి గురయ్యాడు. ట్రాట్ ఇచ్చిన స్ఫూర్తితో ఆఫ్ఘనిస్తాన్ జట్టు మున్ముందు మరిన్ని సంచలన విజయాలు సాధించాలని ఆశిద్దాం.

## దాయాదుల పోరు.. రికార్డుల హోరు

భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య నైపుణ్యం, పోటీతత్వంలో అంతరం పెరుగుతున్నా.. అభిమానుల ఆసక్తి మాత్రం ఏమాత్రం తగ్గడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. గత ఆదివారం కొలంబో వేదికగా దాయాదుల మధ్య జరిగిన టీ20 ప్రపంచకప్ మ్యాచ్ వీక్షణ పరంగా మునుపటి రికార్డులన్నింటినీ తిరగరాసింది. పొట్టి కప్పు అధికారిక డిజిటల్, ప్రసార భాగస్వామి జియోహాట్‌స్టార్ వివరాల ప్రకారం భారత్, పాక్ మ్యాచ్‌ను 16.3 కోట్ల మంది వీక్షించారు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఒక మ్యాచ్‌ను ఈస్థాయిలో వీక్షించడం ఇదే తొలిసారి. భారత్, దక్షిణాఫ్రికా మధ్య 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్ కంటే దాయాదుల పోరుకే ఎక్కువ వీక్షణలు లభించడం విశేషం. 2024లో అమెరికా వేదికగా జరిగిన భారత్, పాక్ మ్యాచ్‌తో పోల్చుకుంటే కొలంబో పోరు డిజిటల్ వీక్షణలు 56 శాతం వృద్ధిని కనబరిచాయి.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, vspnews4@gmail.com